ఉత్తరాంధ్రకు తలమానికం భోగాపురం విమానాశ్రయం

రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖా మంత్రి గుడివాడ అమర్నాథ్

విశాలాంధ్ర-భోగాపురం: భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఉత్తరాంధ్రకు తలమానికమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖా మంత్రి గుడివాడ అమర్నాథ్ అన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి కృత నిశ్చయంతో ఉన్నారని ఆయన స్పష్టం చేశారు. విజయనగరం జిల్లా ఇంఛార్జి మంత్రి బూడి ముత్యాలనాయుడు, ఉత్తరాంధ్ర నేతలు, ప్రజా ప్రతినిధులతో కలిసి ఆయన శని వారం భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణ పనులను పరిశీలించారు. రన్‌వే, టెర్మినల్, అప్రోచ్ రోడ్డు తదితర నిర్మాణ పనుల ప్రగతి గురించి జీఎంఆర్ ప్రతినిధులు మంత్రులకు వివరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ, విమానాశ్రయ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని, 2025 డిసెంబరు నాటికి విమానాశ్రయం సిద్ధమవుతుందని చెప్పారు. ఎయిర్ పోర్టుకు భూమి పూజ చేసిన ముఖ్యమంత్రి జగన్ మోహనరెడ్డే విమానాశ్రయాన్ని ప్రారంభిస్తారని స్పష్టం చేశారు. ఈ ఎయిర్‌పోర్టు నిర్మాణానికి సుమారు 2203 ఎకరాలను జీఎంఆర్ సంస్థకు అప్పగించడం జరిగిందని, 3.8 కిలో మీటర్ల రన్‌వేతో, సుమారు రూ.4,750 కోట్లతో నిర్మించడం జరుగుతోందని తెలిపారు. సుమారు 23 కిలోమీటర్ల ప్రహరీగోడలో ఇప్పటికే దాదాపు 16 కిలోమీటర్లు పూర్తి అయ్యిందని చెప్పారు. ఎయిర్ పోర్టు గురించి, అభివృద్ధి గురించి ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని, జరుగుతున్న అభివృద్ధి పనులను చూడాలని సూచించారు. కేవలం 18 నెలల్లోనే రామాయపట్నం పూర్తి చేస్తున్న ఘనత తమ ప్రభుత్వానికే దక్కిందన్నారు. సుమారు రూ.500 కోట్లతో బందరు పోర్టు నిర్మాణ పనులు జరుగుతున్నాయని చెప్పారు. శ్రీకాకుళం జిల్లా మూలపేట పనులు కూడా ఎంతో వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. ఉద్దానం ప్రజలు దశాబ్దాలపాటు ఎదుర్కొంటున్న కిడ్నీ సమస్యలకు శాశ్వత పరిష్కారాన్ని చూపించిన ఘనత జగన్ మోహనరెడ్డికే దక్కుతుందని కొనియాడారు. జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఉత్తరాంధ్ర అభివృద్ధికి దోహదం చేసే భోగాపురం ఎయిర్‌పోర్టు నిర్మాణాన్ని ప్రభుత్వం ఎంతో ప్రతిష్టా త్మకంగా చేపట్టిందని చెప్పారు. వైకాపా ఉత్తరాంధ్ర సమన్వయకర్త వైవి సుబ్బారెడ్డి మాట్లాడుతూ భోగాపురం ఎయిర్‌పోర్టు పూర్తి అయితే ఈప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతుందని

అన్నారు. దీనివల్ల సుమారు 10 వేలమందికి ప్రత్యక్షంగా, వేలాదిమందికి పరోక్షంగా ఉపాధి లభిస్తుందని చెప్పారు. ఈ పర్యటనలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, ఎంపిలు బెల్లాన చంద్రశేఖర్, ఎంవివి సత్యనారాయణ, ఎంఎల్‌ఏలు బడ్డుకొండ అప్పలనాయుడు, బొత్స అప్పలనరసయ్య, అలజంగి జోగారావు, కంబాల జోగులు, కళావతి, ధర్మాన కృష్ణదాసు, తిప్పల నాగిరెడ్డి, అదీప్‌రాజ్, ఉమాశంకర్ గణేష్, గొల్ల బాబూరావు, అనకాపల్లి, విశాఖ పార్టీ అధ్యక్షులు బొడ్డేటి ప్రసాద్, కోలా గురువులు, నెడ్‌క్యాప్ ఛైర్మన్ కెకె రాజు, శ్రీకాకుళం జెడ్పీ వైస్ ఛైర్మన్ సిరిపురపు జగన్‌మో హనరావు నాయకులు, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, ఆర్డీఓ ఎంవి సూర్యకళ, తాశీల్దార్ సిహెచ్ బంగార్రాజు, ఇతర అధికారులు, జీఎంఆర్ ప్రతినిధులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదంలో వృద్ధుడు సజీవ దహనం

విశాలాంధ్ర-వేపాడ: మండలంలోని బొద్దాం గ్రామంలో శనివారం ఉదయం 6 గంటల ప్రాంతంలో జరిగిన అగ్ని ప్రమాదంలో సిమ్మ నాగమయ్య(72) సజీవ దహనం అయ్యాడు. కుటుంబీకులు స్థానికుల వివరాల ప్రకారం... నాగమయ్యది ఎల్. కోట మండలం చందులూరు గ్రామం ఈయనకు ముగ్గురు కుమార్తెలు, నాగమయ్యకు కాళ్లు చేయి పడిపోవడంతో తన చిన్న కుమార్తె బత్తిన సూరమ్మ దగ్గర భార్య సన్యాసమ్మతో బొద్దాం గ్రామంలో నివాసం ఉంటున్నాడు. రోజూవలె పశువులు పాకలో నిద్రిస్తున్నాడు. రాత్రి చలి ఎక్కువగా ఉండడంతో పడుకున్న పట్టి మంచం కింద చిన్నబొగ్గుల కుంపటి పెట్టుకొని పడుకున్నాడు. కానీ తెల్లవారు జామున మృతుడు కప్పుకున్న దుప్పటి కుంపటి మీద పడి నిప్పు అంటుకోవడంతో ఈ ఘటన జరిగినట్లు, దీంతో పాకలో ఉన్న పశువులు కాలినప్పటికీ తప్పించుకొని బయటకు వచ్చేసాయని నాగమయ్య కాలు చేయి పడిపోవడంతో బయటకు రావలేని పరిస్థితిలో ఉండి అగ్నికి ఆహుతై మృతి చెందాడని ఎవరు లేని సమయంలో ఈ ఘటన జరగడం వల్ల రక్షించలేక పోయినట్లు కుటుంబ సభ్యులు వాపోయారు. ఈ విషయంపై వల్లంపూడి ఎస్సై కే.రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

విజ్ఞానప్రదర్శనలు విద్యార్థుల ప్రతిభను వెలికి తీస్తాయి

బలిజిపేట ఎంఈఓ సామల సింహాచలం

విశాలాంధ్ర-బలిజిపేట: విజ్ఞాన ప్రదర్శనలు విద్యార్థులలో దాగిఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు దోహదపడతాయని మండల విద్యాశాఖాధికారి సామల సింహాచలం అన్నారు. మండలస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ ఎంఈఓ సింహాచలం, హెచ్ఎం జయప్రసాద్ లు ప్రారంభించారు. ఈసందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ మండలస్థాయిలో ఇటు వంటి విజ్ఞాన ప్రదర్శనను ఏర్పాటు చేయడం, ఇందులో మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలల నుండి విద్యార్థులు తమ వినూత్నమైన ఆలోచనలతో తయారుచేసిన ప్రాజెక్టులను ప్రదర్శించడం అభినందనీయమన్నారు. విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకత, ఇటువంటి సైన్స్ ఎగ్జిబిషన్స్ ద్వారా తెలుస్తుందన్నారు. సైన్స్ ఎగ్జిబిషన్ లో పలు ప్రాజెక్టులు ఎంతగానో ఆకట్టుకున్నాయి. అందులో ఉత్తమ ప్రతిభ కనపరిచి, జిల్లాస్థాయికి ఎంపికైన ప్రోజెక్టుల ను ప్రదర్శించిన వారిని అభినందించారు. జిల్లా స్థాయికి నారాయణపురం, వంతరాం, చిలకలపల్లి విద్యార్థుల ప్రాజెక్టులు ఎంపిక చేసినట్లు ప్రకటించారు. న్యాయ నిర్ణేతలుగా స్థానిక జూనియర్ కళాశాల అధ్యాపకులు ఉమామహేశ్వరరావు, జె జగన్నాధ రావులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఉన్నత పాఠశాల ఇంచార్జ్ శ్రీనివాసరావు, స్టాఫ్ సెక్రటరీ ఎంపీ నాయుడు, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నిషేధిత వస్తువులు తరలిస్తే వాహనాలు సీజ్

బొబ్బిలి రూరల్ సిఐ తిరుమలరావు

విశాలాంధ్ర -రామభద్రపురం: నిషేధిత వస్తువులు వాహనాలలో తరలిస్తే వాహనాలను సీజ్‌చేస్తామని బొబ్బిలి రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ తిరుమలరావు అన్నారు. శనివారం మండల కేంద్రంలో బైపాస్ జంక్షన్‌లో ఉన్న చెక్ పోస్ట్ వద్ద వాహనాలను స్థానిక ఎస్ఐ సురేంద్రనాయుడుతో కలిసి తనిఖీలు చేపట్టారు. తనిఖీలలో భాగంగా ప్రతి వాహనాన్ని ఆపి రికార్డులను పరిశీలించారు. అలాగే వాహనాన్ని కూడా క్షుణ్ణంగా పరిశీలించారు. వాహనాలలో ఒడిస్సా రాష్ట్రం నుంచి అక్రమంగా ఆంధ్రకు నిషేధిత వస్తువులైన గంజాయి, ఖైని ,గుట్కా వంటివి అక్రమంగా రవాణా కాకుండా చెక్పోస్ట్ వద్ద ఎప్పటికప్పుడు తనిఖీలు చేపట్టడం జరుగుతుందన్నారు. అలాగే రాత్రి వేళల్లో సిబ్బంది గ్రామాలలోగస్తీ తిరుగుతూ ఉంటారని తెలిపారు. గ్రామాల్లో ఎటువంటి అసాంఘిక కార్యక్రమా లకు పాల్పడిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో చెక్ పోస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

రాతిబుగ్గి, మట్టిపై పన్నుల వసూళ్లు ఆపకపోతే పోరాటం చేస్తాం

వెంకటరమణపేట గ్రామస్తులు హెచ్చరిక

విశాలాంధ్ర-శృంగవరపుకోట: గ్రామ పరిధిలోని క్వారీలు, క్రషర్ల నుంచి పేద, మధ్యతరగతి ప్రజలు క్వారీల యాజమాన్యం ఉచితంగా ఇచ్చే రాతి, బుగ్గి మట్టిను తెచ్చుకునేందుకు కూడా వీలు లేకుండా ఒక ప్రైవేటు సంస్థ వారు రాయల్టీ పేరుతో వేల రూపాయిలు వసూళ్లు చేస్తూ తమను ఇబ్బందులు పెడుతుండటంపై వెంకటరమణపేట ప్రజలు, యువత ఆందోళనకు దిగారు. మండలంలోని కొత్తూరు క్వారీకి వెళ్లే రోడ్డులో కొన్ని చోట్ల వాహనాలు వెళ్లకుండా గోతులు తవ్వి రోడ్డుకు అడ్డుగా ద్వీచక్రవాహనాలు నిలిపి శనివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా స్థానిక యువతతో పాటు క్వారీలను ఆనుకుని ఉన్న చుట్టు పక్కల గ్రామాల ప్రజలు మాట్లాడుతూ తమ సమీపంలో ఉన్న క్వారీల నుండి ఇళ్లు పునాదులులకు పనికి వచ్చే మట్టి, బుగ్గి తెచ్చి వేసుకుంటున్నామని, అయితే వీటికి కుడా ఇటీవల కాలంలో తాము ప్రభుత్వం నుంచి కాంట్రాక్ట్ పొందామని కొందరు వ్యక్తులు తాము తెచ్చుకుంటున్న మట్టిని అడ్డుకోని రూ. వెయ్యిచోప్పున రాయల్టీ పేరుతో వసూళ్లు చేస్తున్నారన్నారు. పేద, మధ్యతరగతి వారిమి ఇళ్లు కట్టుకోవడమే కష్టమైన పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. ఇప్పుడు ఇసుక, ఇనుము, సిమెంట్ వంటి రేట్లు పెరిగి అప్పులు చేసి ఇళ్లు కట్టుకుంటున్నామని వెల్లడించారు. అయితే ఇప్పుడు క్వారీల వారు ఉచితంగా ఇచ్చే వాటిని తాము తెచ్చుకుంటున్నా రాయల్టి పేరుతో డబ్బులు వసూళ్లు చేయడం సరికాదన్నారు. దూర ప్రాంతాలకు ఎలా వసూళ్లు చేసుకున్నా అభ్యంతరం లేదని, తమ గ్రామంలో వున్న క్వారీల నుంచి తాము తెచ్చుకుంటే వసూళ్లు సరికాదని యువకులు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇదే విషయంపై (ప్రైవేట్ మైన్స్ నుంచి రాయల్టి వసూళ్లు చేస్తున్న రాఘవ సంస్థ ప్రతినిధి రాజేష్ ను వివరణ కోరగా క్వారీ, క్రషర్ల పరిధిలో ఎటువంటివి తెచ్చినా సరే రాయల్టీ కట్టాల్సిందేనని తేల్చిచెప్పారు.

విద్యార్థి జీవితం ఎంతో కీలకమైన దశ

ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు

విశాలాంధ్ర-శృంగవరపుకోట : విద్యార్థి జీవితం ఎంతో కీలకమైన దశ అని, జీవితంలో అన్నింటికంటే చదువునకే మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు విద్యార్థులకు సూచించారు. శ్రీబాలాజీ జిల్లా వెంకటాపురం వద్ద గల ప్రభుత్వ జూనియర్ కళాశాలను 39వ రోజు పాదయాత్ర సందర్భంగా ఎమ్మెల్సీ రఘురాజు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ మన తోటి విద్యార్థులు కూడా మనతో పాటే పైకి ఎదిగేలా వారికి తోడ్పాటు అందించాలని కోరుతూ, ప్రతి వెనుకబడిన విద్యార్థికి ఒక తెలివైన విద్యార్థిని తోడుగా పెట్టి అందరూ ఉన్నతంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని అధ్యాపకులు, కళాశాల ప్రిన్సిపాల్ కు సూచించారు. విద్యార్థులను తమ సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేసుకుని చదువులో ముందంజ వేయాలని సూచించారు. ఈ సందర్భముగా విద్యార్థుల చదువు సామర్థ్యాలను పరీక్షించారు. అనంతరం కళాశాల ఆవరణలో పచ్చదనం లేమిని గమనించిన ఎమ్మెల్సీ రఘురాజు కళాశాల ఆవరణలో 40 మొక్కలు నాటారు. ఈ మొక్కల సంరక్షణ విషయమై సిబ్బందికి పలు సూచనలు జారీ చేసారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ సతీమణి & ఎస్.కోట వైస్ ఎం.పి.పి ఇందుకూరి సుధారాజు, రాష్ట్ర సాంస్కృతిక మరియు సైన్స్ అకాడమీ చైర్మన్ గుమ్మడి స్వాతిరత్నం, స్థానిక సర్పంచ్ వెంకట సుబ్బయ్య, ఎస్.కోట సర్పంచ్ జి.సంతోషి కుమారి, ఎం.పి.టి.సి మజ్జి దేవి, వార్డు మెంబర్ మామిడి కృష్ణవేణి, కళాశాల సిబ్బంది, ఎమ్మెల్సీతో పాదయాత్ర చేస్తున్న మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగన్ ఇదేనా మీ సంస్కారం : జనసేన నేత గురాన అయ్యలు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: ఒక రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా బాధ్యతాయుతమైన స్థానంలో ఉన్న జగన్ మోహన్ రెడ్డి వ్యక్తిగతంగా అత్యంత నీచమైన స్థాయికి దిగజారి మాట్లాడటం సరికాదని జనసేన నేత గురాన అయ్యలు అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ పై జగన్ వ్యాఖ్యలు ఆయన అసహనానికి నిదర్శనమన్నారు. తెలంగాణ ఎన్నికల్లో జనసేన పార్టీకి బర్రెలక్క కంటే తక్కువ ఓట్లు వచ్చాయంటూ సీఎం జగన్ వ్యాఖ్యలు చేయడం సిగ్గు చేటు అన్నారు. 2014లో తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీకి నోటా కంటే 56 స్థానాల్లో తక్కువ ఓట్లు వచ్చాయని ఎద్దేవా చేశారు. తెలంగాణ ప్రజలు రాళ్లతో కొట్టిన తీరు మర్చిపోయావా అంటూ జగన్‌ను ప్రశ్నించారు. ఇండిపెండెంట్‌గా నిలబడి పోటీ చేసే దమ్ము బర్రెలక్కకైనా ఉంది కానీ.. తెలంగాణలో పోటీ చేసే దమ్ము జగన్‌కు, వైసీపీకి లేదన్నారు. ఆంధ్ర రాష్ట్రంలోగత ఎన్నికల్లో 175 స్థానాల్లో పోటీ చేసిన అభ్యర్థులతోనే 2024 ఎన్నికలకు వచ్చే సత్తా వుందా అని జగన్ కి సవాల్ చేశారు. శ్రీకాకుళం జిల్లాలోని ఉద్దానం పరిసర ప్రాంతాల్లో కిడ్నీ సమస్యతో బాధపడుతున్న వారి కోసం జనసేన

అధినేత పవన్ కళ్యాణ్ గత కొన్ని సంవత్సరాలుగా ఉద్యమిస్తున్నారన్నారు. పవన్ కళ్యాణ్ వల్లనే ఉద్దానం కిడ్నీ సమస్య పరిష్కారానికి కదలిక వచ్చిందన్నారు. సమయం, సందర్భం లేకుండా నోటికి వచ్చిన్నట్లు ప్రతిపక్ష నేతలను కించపరుస్తూ మాట్లాడే ఇటువంటి ముఖ్యమంత్రి ఈ రాష్ట్రానికి ఉండటం చాలాదురదృష్టకరమన్నారు. ప్రభుత్వ సొమ్ముతో అధికారికంగా నిర్వహిస్తున్న కార్యక్రమంలో సిఎం జగన్మోహన్ రెడ్డి ప్రజలకు నాలుగు మంచి మాటలు చెబితే బాగుండేదన్నారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని, రాబోయే ఎన్నికల్లో ప్రభుత్వానికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు.

అంగన్వాడీ సిబ్బంది సమస్యల పరిష్కరించాలి : సీపీఐ



విశాలాంధ్ర-బొబ్బిలి : ప్రతిపక్షంలో ఎన్నికల ప్రచారం పాదయాత్రలో వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆంధ్రప్రదేశ్లో అంగన్వాడి సిబ్బందికి వేతనాల తక్కువగా ఉన్నాయని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే తెలంగాణ రాష్ట్రంలో అంగన్వాడి సిబ్బందికి ఇచ్చిన వేతనాలు ఏపీలో అమలు చేస్తామని అంగన్వాడి సిబ్బందికి ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని చేపట్టిన రిలే నిరాహార దీక్షకు భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి చర్యలు చేపట్టాలని అంగన్వాడి కేంద్రాలు అంగన్వాడి సిబ్బంది కాకుండా సచివాలయ సిబ్బందితో కేంద్రాల తాళాలు పగలగొట్టడం ప్రభుత్వ దుర్మార్గ చర్యలను ఖండించారు. అంగన్వాడి కార్యకర్తలు ఆయాలు న్యాయమైన డిమాండ్ల పరిష్కారం చేసి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రెటరీ మునకాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు ఇన్‌చార్జిల నియామకం

నేటినుంచి ఎస్‌హెచ్‌జి గ్రూపులకు వంట బాధ్యత

విశాలాంధ్ర-జామి: రాష్ట్రంలో తమ న్యాయమైన డిమాండ్‌లను నెరవేర్చాలని సమ్మె బాట పట్టిన అంగన్‌వాడీ సిబ్బందిపై ప్రభుత్వం మరింత కర్కశంగా వ్యవహరిస్తోంది. ఇప్పటికే మండలంలోని 74 అంగన్‌వాడీ కేంద్రాలను సచివాలయ మహిళాపోలీస్‌లు స్వాధీనం చేసుకోగా తాజాగా ఒక్కో అంగన్‌వాడీ కేంద్రానికి ఒక్కో ఇన్‌చార్జిగా సచివాలయ అధికారిని నియమించారు. ఈమేరకు ప్రతీ మండల పరిషత్ కార్యాలయంలో ఇన్‌చార్జిల నియామకాన్ని పూర్తి చేసారు. సోమవారం నుంచి వీరంతా ఆయా కేంద్రాలను తమ ఆధీనంలోకి తెచ్చుకుంటారు. ఇక అంగన్‌వాడీ కేంద్రాలలో వంటల బాధ్యతలను స్థానికంగా ఉన్న మహిళా సంఘాలకు అప్పగించారు. స్థానిక వెలుగు శాఖ సహకారంతో ఇప్పటికే కేంద్రాల వారీగా డ్వాక్రా సంఘాల నియమకాన్ని సైతం పూర్తి చేసారు. శనివారం సాయంత్రానికి నియమకాల ప్రక్రియ పూర్తి కావడంతో అదే జాబితాలను ఐసిడిఎస్ అధికారులకు, జిల్లా ఉన్నతాధికారులకు మండల పరిషత్ నుంచి పంపించడం జరిగింది. ఇదిలా ఉండగా అంగన్‌వాడీ కేంద్రాలలో ప్రస్తుతం ఉన్న స్టాక్‌ను నమోదు చేయడమే కాకుండా వీడియో తీయాలని అధికారులు సూచించారు. సమ్మె విరమణ జరిగే వరకు ఎంపిడివో, సిడిపిఓలు కేంద్రాలను రోజువారీ పర్యవేక్షణ చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు వచ్చాయి. ప్రతీరోజూ ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12 వరకు కేంద్రాలను తెరిచి వుంచాలని సూచించారు. సమీప పాఠశాలల్లో వండించి కేంద్రాలలో వడ్డించా లని ఆదేశించారు. మరోవైపు తమకు వంటల బాధ్యతలను అప్పగించడంపై ఎస్‌హెచ్‌జి గ్రూపు సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సమ్మె కారణంగా ఎన్ని రోజులు ఇలా వంటలు చేయాల్సి వస్తుందోనని, తమ కూలి పనులు పోతాయని ఆందోళన చెందుతున్నారు. ఈ వంటల బాధ్యతకు తమకు ఎటువంటి పరిహారం ఇస్తారో కూడా చెప్పకుండా ఇలా విదులకు అప్పగిం చడమేంటని వారంతా ప్రశ్నిస్తున్నారు.

ఎస్పీ దీపికకు దిశ, కన్విక్షన్ బేస్డ్ పోలీసింగ్ లో ఉత్తమ ప్రతిభ

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : రాష్ట్ర వ్యాప్తంగా శాంతిభద్రతల విభాగం లో 2022 సంవత్సరంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన కానిస్టేబుల్ నుండి అడిషనల్ డీజీ స్థాయి అధికారులకు రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ కె.రాజేంద్రనాథ్ రెడ్డి శనివారం డిజిపి ప్రధాన పోలీస్ కార్యాలయం మంగళగిరిలో డీజీపీ డిస్క్ అవార్డుల ప్రధానం చేశారు. ఇందులో భాగంగా జిల్లా ఎస్పీ ఎం.దీపిక, ఐపిఎస్ కు క్షేత్రస్థాయిలో శాంతిభద్రతల విభాగంతో పాటు దిశ, కన్విక్షన్ బేస్డ్ పోలీసింగ్ లో ఉత్తమ ప్రతిభ కనబరిచి అందించిన సేవలను గుర్తించిన డిజిపి రాజేంద్రనాథ్ రెడ్డి డిజిపి డిస్క్ అవార్డును ప్రధానం చేసి ప్రత్యేకంగా అభినందించారు. అదే విధంగా చీపురుపల్లి పోలీసు స్టేషనులో కానిస్టేబులుగా పని చేస్తున్న భానోజీరావు కూడా రాష్ట్ర డిజిపి చేతుల మీదుగా డిజిపి డిస్క్ అవార్డు అందుకున్నారు.

ధాన్యపు కొనుగోళ్ల కేంద్రాన్ని పరిశీలించిన జాయింట్ కలెక్టర్ గోవిందరావు

విశాలాంధ్ర-పాచిపెంట: పార్వతీపురం మన్యం జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్ గోవిందరావు విశ్వనాధపురం లో ధాన్యపు కొనుగోళ్ళను శనివారం పరిశీలించారు ఎంపీడీవో లక్ష్మి కాంత్ తాసిల్దార్ రాజశేఖర్లతో కలిసి రైతులతో మాట్లాడుతూ ఎకరానికి వచ్చిన దిగుబడి ఎకరానికి అయ్యే పెట్టుబడి గురించి ఆరా తీశారు అలాగే తుఫానులో జరిగే పంట నష్టాల గురించి రైతులను ప్రశ్నించగా గ్రామంలో పెద్దగా పంట నష్టాలు జరగలేదని తెలిపారు బాగున్న గోనె సంచలన మాత్రమే రైతులకు ఇవ్వాలని గ్రామ వ్యవసాయ సహాయకులను ఆదేశించారు అలాగే రైతులకు అందుబాటులో ఉండి ధాన్యం కొనుగోళ్ళను వేగవంతం చేయాలని వ్యవసాయ అధికారిని ఆదేశించారు తేమ శాతం 17% లోపు ఉండేటట్టు రైతులకు తెలపాలని నాణ్యత ప్రమాణాలను జాగ్రత్తగా పరిశీలించి ధాన్యపు కొనుగోలను జరపాలని కొనుగోలు సిబ్బందిని ఆదేశించారు ఈ కార్యక్రమంలో పాచిపెంట మండల పరిషత్ డెవలప్మెంట్ ఆఫీసర్ లక్ష్మీకాంత్ తహసిల్దార్ రాజశేఖర్ వ్యవసాయ అధికారి తిరుపతిరావు మరియు రైతులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు గిరిజన విద్యార్థుల ఎంపిక హర్షణీయం



విశాలాంధ్ర-సీతంపేట: జాతీయస్థాయి పోటీలకు సీతంపేట బాలుర గురుకుల జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు ఎంపికయ్యారు. ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో జావెలిన్ త్రో విభాగంలో బిడ్డిక దినేష్ గోల్డ్ మెడల్ సాధించి, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అదే విధంగా ట్రిపుల్ జంప్ విభాగంలో ఊయక భద్ర సిల్వర్ మెడల్ సాధించి, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 24 వ తేదీన మహారాష్ట్రలోని చంద్రపూర్ లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు హాజరవుతారు. వీరిని ఐటిడిఎ పీవో కల్పనకుమారి అభినందించారు. జాతీయ స్థాయి పోటీలకు అవసరమయ్యే సహకారం అందిస్తామని అన్నారు. జాతీయ స్థాయి పోటీల్లో కూడా ఉత్తమ ప్రతిభ కనబరచాలని సూచించారు. వీరితో పాటు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్న పలువురు క్రీడాకారులను పీవో అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో రోసిరెడ్డి, డీడీ మంగవేణి, ఐటిడిఎ స్పోర్ట్స్ ఇంచార్జ్ జాకబ్ దయానందం, బాలుర గురుకుల కళాశాల ప్రిన్సిపల్ నాగభూషణరావు, పీడీ లక్ష్మణమూర్తి పాల్గొన్నారు.

పలుగ్రామాల్లో బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ

విశాలాంధ్ర-పార్వతీపురం: నియోజకవర్గంలో బాబుష్యూరిటి-భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమాన్ని టీడీపీ నియోజక వర్గ ఇంచార్జి బోనెల విజయ్ చంద్ర, మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్, మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవిలు దగ్గరుండి మూడు మండలాల పరిధిలోని నాయకులతో, పురపాలక సంఘం నాయకులతోకలిసి నిర్వ హిస్తున్నారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలను అందజేసి రానున్న సాధారణ ఎన్నికలలో టీడీపీ అధినేత చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేయాలని కోరారు. లక్ష్యాలను సాధించడానికి కృషి చేస్తున్నట్లు నాయకులు తెలిపారు. ఈకార్యక్రమంలో బోను దేవీచంద్రమౌళి,గొట్టాపు వెంకటనాయుడు, గుంట్రెడ్డి రవికుమార్, మజ్జి వెంకటేష్,బడే గౌరునాయుడు, పోలసత్యనారాయణ, బార్నాల సీతారాం, కె.నారాయణరావు, జి.చంద్రమౌళి, కొల్లి తిరుపతిరావు, రౌతు వేణుగోపాలనాయుడు, డాక్టర్ భాను ప్రసాద్, కోలా మధుసూధన్, కోల బాబు, బొమ్మినాయిని లక్ష్మణ,బుడితి శ్రీరాములు, సబ్బాన శ్రీను, పెంకి వేణునాయుడు, బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతిలోగా ధాన్యం సేకరణ పూర్తి

మిల్లర్లు బ్యాంకు గ్యారంటీలు సమర్పించకపోతే ఇతర జిల్లాల మిల్లర్లకు అవకాశం

విశాలాంధ్ర-పార్వతీపురం/గరుగుబిల్లి : జిల్లాలో ధాన్యం సేకరణ సంక్రాంతి నాటికి పూర్తి చేయుటకు అన్ని చర్యలు చేపడుతున్నామని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. గరుగుబిల్లి మండలం లోని గొట్టివలస గ్రామంలో ధాన్యం సేకరణ కేంద్రాన్ని శనివారం జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ధాన్యం సేకరణకు అన్ని పరికరాలు అందుబాటులో ఉన్నాయా లేదా అని గమనించారు. తేమ శాతం, రవాణా విధానం, రవాణా వాహనాలకు జీపిఎస్ ఏర్పాటు, ధాన్యం బస్తాల పరిస్థితి, ట్రక్ షీట్ జనరేషన్ పరిశీలించారు. ధాన్యం కొనుగోలు సజావుగా జరగాలని ఆయన ఆదేశించారు. రైతులకు ఇబ్బందులు ఉండరాదని ఆయన స్పష్టం చేశారు. జిల్లాలో అవసరాలకు పోగా మిగిలిన ధాన్యం మొత్తం కొనుగోలుకు అవకాశం ఉందని ఆయన చెప్పారు.

సంక్రాంతి నాటికి ధాన్యం సేకరణ పూర్తి చేయాలని ప్రయత్నిస్తున్నామని, అనివార్య కారణాల వలన జాప్యం జరిగితే జనవరి 20 నాటికి పూర్తి చేస్తామని ఆయన తెలిపారు.

మిల్లర్లు బ్యాంకు గ్యారంటీలను(బిజిలు) సమర్పించక పోతే ఇతర జిల్లాల మిల్లర్లకు అవకాశం కల్పించాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఇందుకు తక్షణ చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారు. బిజిల జాప్యం మూలంగా ధాన్యం సేకరణలో ఇబ్బందులు తలెత్తరాదని ఆయన చెప్పారు. ఈకార్యక్రమంలో పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ ఎం దేవుళ్ల నాయక్, వ్యవసాయ అధికారి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కేంద్రం పరిశీలించిన ఐటీడీఏ పిఓ విష్ణుచరణ

విశాలాంధ్ర -కొమరాడ: ధాన్యం పరిశీలించిన పిఓ విష్ణు చరణ శనివారం గంగురేగువలస గ్రామం లో ధాన్యం కొను గోలు కేంద్రాన్ని ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సి విష్ణుచరణ్ శనివారం తనిఖీ చేశారు. మిల్లుల వద్ద లారీలను వెంటనే అన్ లోడ్ చేయాలని ఆదేశించారు. ధాన్యముతో లోడ్ వచ్చిన వెంటనే అన్‌లోడ్ చేయాలని స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రంకు అవసరమైన వాహనాలకు జీపీఎస్ కచ్చితంగా అమర్చవలసిన అవసరం ఉందని ఆయన అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రం సిబ్బంది, వ్యవసాయ సిబ్బంది రైతులకు ధాన్యం కొనుగోలు ప్రక్రియ పై స్పష్టమైన అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. తేమ శాతం, ధాన్యం సంచులు, రవాణా ఖర్చులు తదితర అంశాలపై స్పష్టమైన అవగాహన అవసరమని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రంకు వచ్చిన ధాన్యాన్ని తక్షణం అనుసంధానించిన మిల్లులకు తరలించాలని ఆయన ఆదేశించారు. ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద కస్టోడియన్ అధికారులు విధిగా ఉండాలని, రైతులకు ఎటువంటి ఇబ్బందులూ తలెత్తరాదని అన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పిశంకర్రావు రైతు భరోసా కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

నిడగల్లు అభివృద్ధి కొరకు 31.32 కోట్లు రూపాయలు వెచ్చించిన వైసీపీ : ఎమ్మెల్యే అలజంగి

విశాలాంధ్ర-సీతానగరం: నిడగల్లు గ్రామంలో పార్టీలకు అతీతంగా ప్రతీఒక్క కుటుంబాన్ని ఆదుకుని, అందరికీ అండగా నిలిచిన ఏకైకప్రభుత్వం వైఎస్సార్సీపీ ప్రభుత్వమేనని, నాలుగున్నరేళ్ల పరిపాలనలో నిడగల్లులో ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారుగా 31.32 కోట్ల రూపాయలతో అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేసినట్లు ఎమ్మెల్యే జోగారావు తెలిపారు. ఆయన నిడగల్లులో మాట్లడుతూ సీఎం వైఎస్ జగన్మోహన్రెడ్డి హయాంలో పెద్ద ఎత్తున అభివృద్ధి చేసినట్లు చెప్పారు. నిడగల్లు సచివాలయంలో ప్రత్యక్ష నగదు బదిలీ (డిబిటీ) ద్వారా 20.78 కోట్ల రూపాయలు మేర నేరుగా ప్రజలకు లబ్ది చేకూరగా, పరోక్ష ప్రయోజనాలు (నాన్ డిబిటీ) ద్వారా 6.38 కోట్ల రూపాయలు గ్రామ ప్రజలకు లబ్ది చేకూరిందన్నారు. సచివాలయం పరిధిలో నాడు-నేడు స్కూల్, ఆసుపత్రులు, సచివాలయం కార్యాలయాలు, రోడ్లు మరియు ఇతర అభివృద్ధి పనులకు గాను సుమారుగా 4.15 కోట్ల రూపాయలు ఖర్చు చేసినట్లు చెప్పారు. ప్రభుత్వం ప్రతీఒక్కరికీ చేసిన మేలును వివరించి వారి వద్ద నుంచి ఆశీస్సులు తీసుకుని వచ్చే ఎన్నికలలో తప్పక మీ అందరి బిడ్డ సీఎం వైయస్ జగన్ ను మళ్లీ సీఎం గా గెలిపించుకోవాలని, ఈ ప్రభుత్వాన్ని కాపాడు కోవాల్సిన బాధ్యత మీ అందరిపై ఉందని ఎమ్మెల్యే పిలుపు నిచ్చారు. గ్రామంలో పార్టీలకు అతీతంగా ఎటువంటి లంచాలు, మధ్యవర్తులు లేకుండా అర్హులుఅందరికీ వారి ఇంటికే వాలంటీర్లు ద్వారా అన్ని సంక్షేమ పథకాలను అందిస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్సీపీ ప్రభుత్వం అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు జెడ్పీటీసీ బాబ్జి, ఎంపిపి ప్రతినిధి బలగ శ్రీరాములు, మండలపార్టీ అధ్యక్షుడు బొంగు చిట్టిరాజు, వైస్ ఎంపీపీ తోడబండి సూర్యనారాయణ, సర్పంచ్ ఆరుద్రమ్మ, వైస్ ప్రెసిడెంట్ బర్ల సింహాచలం,నాయకులు పోల ఈశ్వరనారాయణ, ఆర్వీ పార్థసారథి, కన్వీనర్ గాజాపు శ్రీనివాసరావు, పరువాడ తిరుపతిరావు, ఎస్ రాజుపాత్రుడు, టి వెంకటప్పల నాయుడు, బుడితి గౌరునాయుడు, బుడితి ముకుంద, కురమాన శ్రీనివాసరావు, ఎస్ కిరణ్ కుమార్, ఎగిరెడ్డి గోపాల్, నాయకులు, కార్యకర్తలు, సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులు, వాలంటీర్లు, సచివాలయం ఉద్యోగులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

ఐసిడిఎస్ తోనే వ్యవస్థ బలోపేతం

టిడిపి మాజీ ఎమ్మెల్సీ గుమ్మడి సంధ్యారాణి వెల్లడి

విశాలాంధ్ర-మక్కువ : మండలంలో అంగన్వాడి వ్యవస్థ ఐసిడిఎస్ తోనే వ్యవస్థ బలోపేతం అయ్యింది. టిడిపి మాజీ ఎమ్మెల్సీ గుమ్మడి సంధ్యారాణి వెల్లడి. గర్భిణీలు, శిశువులు, మహిళల్లో ఘననీయంగా మరణాలు తగ్గించి ,జీవన ప్రమాణాలు పెంచేందుకు అంగన్వాడీ వ్యవస్థ దోహద పడిందని, తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యురాలు గుమ్మడి సంధ్యారాణి వెల్లడించారు. 5వ రోజు పార్వతీపురం మన్యం జిల్లా మక్కువ మండలంలో దీక్షా శిబిరాన్ని సందర్శించి తెలుగుదేశం పార్టీ నాయ కులతో కలిసి మద్దతు తెలిపారు. శిబిరంలో ముందుగా గిరిజన సంఘం మండల నాయకులు టీ ప్రభాకర్ రావు ,మక్కువ మండల అంగన్వాడి సంఘం నాయకులు, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్వై నాయుడు తో కలిసి నిన్న రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఉపాధ్యాయ శాసనమండలి సభ్యులు కామ్రేడ్ షేక్ సబ్జి గారికి సంతాపం ప్రకటించి, నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలో అంగన్వాడీల పట్ల ప్రభుత్వం రెచ్చగొట్టే వైఖరిని ప్రదర్శిస్తుందని, ఇది సరికాదని సమాజంలో హక్కుల కోసం నినదించే పరిస్థితి లేదని, ఈ పరిస్థితి మార్పు రావాలని అంగన్వాడీలు చేస్తున్న న్యాయమైన పోరాటానికి తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని, అధికారంలోకి రావుగానే అంగన్వాడీలకు సానుకూలమైనటువంటి నిర్ణయాలు చేసేందుకు కృషి చేస్తానని అంగన్వాడీలకు తెలిపారు ,తెలుగుదేశం పార్టీ మక్కువ మండల అధ్యక్షులు వేణు , తెలుగుదేశం పార్టీ మండల నాయకులు పాల్గొని అంగన్వాడికి సంఘీభావంగా నిలిచారు. సిఐటియు జిల్లా కార్యదర్శి నాయుడు మాట్లాడుతూ ప్రభుత్వం కవ్వింపు చర్యలకు పోకుండా గ్రాడ్యుటీ వేతనాల పెంపు ఉద్యోగ భద్రతా వంటి సమస్యలను పరిష్కారం చేసేందుకు కృషి చేయాలని లేకుంటే సమ్మె ను ఉధృతం చేస్తామని దానికి ప్రభుత్వమే బాధ్యత మహించాల్సి ఉంటుందని తెలిపారు .గిరిజన సంఘం మండల నాయకులు ప్రభాకర్ రావు ,అంగన్వాడి మండల నాయకులు పద్మ, సుశీల ,సీతమ్మ ,గౌరీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి ధనుర్మాస పూజలు



విశాలాంధ్ర -సీతానగరం: ఆదివారం ఉదయం 4-30 గంటలనుంచి ధనుర్మాసం ప్రారంభమయి జనవరి 14తో ముగుస్తుందని స్థానిక శ్రీవేణుగోపాల స్వామి అర్చకులు, లచ్చయ్యపేట శ్రీవేంటేశ్వరస్వామి అర్చకులు తెలిపారు. నెల రోజుల పాటు గోవింద నామస్మరణ జరుగుతుందని, ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని, నగర సంకీర్తన జరుగుతుందని తెలిపారు. నేడు నెలగంటు పెట్టడం జరుగుతుందని తెలిపారు. భక్తులు గోవింద మాలలువేసి నెలరోజులపాటు దీక్షలోఉండి పూజలు చేస్తారని,భజనలు, కీర్తనలు,పాటలు పాడుతారని చెప్పారు. ఇదిలాఉండగా లచ్చయ్యపేటలోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో నేడు శ్రీగోదాదేవి అమ్మవారి పంచామృత అభిషేకం జరుగుతుందని, శ్రావణ నక్షత్రం సందర్భంగా శ్రీవేంక టేశ్వర స్వామి వారికీ పంచామృత అభిషేకం మరియు శ్రీ స్వామి వారి కళ్యాణం ఉదయం 10.30 గంటలకు జరుగుతుందని అర్చకులు తెలిపారు.

క్రీడా మైదానం ను పరిశీలించిన శాప్ అధికారులు

విశాలాంధ్ర-కురుపాం: జియ్యమ్మవలస మండలం రావాడ రామభద్రపురం గతంలో మంజూరైన క్రీడా పాఠశాల మైదానాలను శాప్ (SAAP) అసిస్టెంట్ ఇంజనీర్ పి.రాధాకృష్ణ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 400 రన్నింగ్ ట్రాక్ తో పాటు మరి కొన్ని క్రీడా మైదానాలు కు జిల్లా క్రీడా అధికారులు నుండి ప్రపోజల్స్ అందయాని వాటికి స్థల పరిశీలన నిమిత్తంవచ్చారని మరి కొద్ది రోజుల్లో పనులు ప్రారంభి స్తామన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన అభ్యుదయ సంఘం అధ్యక్షుడు ఆరిక చంద్రశేఖర్,మండల, సర్వేయర్లు, జి.హనుమంత్ రావు, విలేజ్ సర్వేయర్లు బాబ్జీ ,ప్రశాంత్ విఆర్ఓ జి. చిరంజీవి తదితర్లు పాల్గొన్నారు.

జేకేసిలో వచ్చిన ఫిర్యాదులు పరిష్కరించాలి

ప్రత్యేక అధికారి లక్ష్మీనారాయణ

విశాలాంధ్ర-వేపాడ : వివిధ సమస్యలపై జేకేసి స్పందనలో వచ్చిన ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని మండల ప్రత్యేక అధికారి లక్ష్మీనారాయణ మండల అధికారులకు సూచించారు.మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మల్లు ప్రత్యేక అధికారి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్నకు చెబుతాం కార్యక్రమంలో వచ్చిన వినతలను తొందరగా పరిష్కరించాలని కోరారు, జగనన్న హౌసింగ్ లో భాగంగా ఇల్లు నిర్మాణాలు త్వరిగతిన పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అసిస్టెంట్లను ఆదేశించారు . వివిధ శాఖల పనితీరును సమీక్షించారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఘనంగా విజయ్ దివస్

విశాలాంధ్ర-చీపురుపల్లి: చీపురుపల్లి జి.అగ్రహారం మండల ప్రాధమిక ఉన్నత పాఠశాల ఆవరణలో ఆశయ యూత్ అసోషియేషన్ వారి ఆధ్వర్యంలో విజయ్‌దివస్ కార్యక్రమం నిర్వహించారు విద్యార్థులకు దేశం కోసం ప్రాణత్యాగం చేసిన వీరుల గురించి అవగాహన కల్పించారుఈ కార్యక్రమంలో ఆశయ సంస్థ అధ్యక్షులు రెడ్డి రమణ మాట్లాడుతూ బంగ్లాదేశ్‌ను సృష్టించి 1971 నాటి భారత్-పాకిస్తానీ యుద్ధంలో భారత సాయుధ బలగాలు, తూర్పు పాకిస్తానీ గెరిల్లా దళాలు విజయం సాధించిన రోజును విజయ్ దివస్ సూచిస్తుంది. విజయ్ దివాస్ 13 రోజుల యుద్ధం డిసెంబర్ 16, 1971న పాకిస్తాన్ సైన్యం లొంగిపోవడంతో ముగిసింది. ప్రతి సంవత్సరం డిసెంబర్ 16న విజయ్ దివస్ జరుపుకుంటారు. 1971లో జరిగిన యుద్ధం యునైటెడ్ స్టేట్స్ భారతదేశం దక్షిణాసియా ప్రాంతం, పాకిస్తాన్ మరియు బంగ్లాదేశ్ల మధ్య సంబంధాన్ని మార్చింది. 1971 నాటి ఇండో-పాకిస్తానీ యుద్ధంలో తూర్పు పాకిస్తాన్ (ప్రస్తుతం బంగ్లాదేశ్) గెరిల్లా దళాలతో కలిసి భారత సాయుధ దళాలు విజయం సాధించి, స్వతంత్ర దేశమైన బంగ్లా దేశ్‌ను సృష్టించిన రోజును విజయ్ దివస్ సూచిస్తుంది అని అన్నారుఈ కార్యక్రమంలో హెచ్‌ఎం జగన్నాధం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఐదోరోజు కొనసాగిన అంగన్వాడీల నిరవధిక సమ్మె

విశాలాంధ్ర-సీతానగరం: అంగన్వాడి కార్యకర్తలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, తెలంగాణ కన్నా అదనంగా వేతనాలు పెంచాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటి అమలు చేయాలని,మినీ సెంటర్లను మెయిన్ సెంట్రల్ గా మార్చాలనితదితర డిమాండ్లతో సమ్మె చేస్తున్న అంగన్వాడి కార్యకర్తలు, సహాయకుల సిబ్బంది ఐదోరోజు శనివారం కూడా నిర్వహించారు. అంతా పాల్గొని నినాదాలు చేస్తూ నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. నల్లరిబ్బన్లు కళ్ళకు కట్టుకొని నిరసన తెలిపారు. నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఎంపిడిఓ ఎంఎల్‌ఎస్ ప్రసాద్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. పాదయాత్ర లో సీఎం వైఎస్ జగన్మోహన్రెడ్డి గతంలో హామీ ఇచ్చారని, నేడు మరచారని తెలిపారు.ఇచ్చిన మాటను సీఎం వైఎస్ జగన్ నిలబెట్టుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి జి.వెంకటరమణ, అంగన్వాడి అధ్యక్ష, కార్యదర్శులు వెన్నెల రామలక్ష్మి, మరడ సత్యవతి, లక్ష్మి,సునీత, శైలజ,రెడ్డి ఈశ్వర రావు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన ధర్మవరం విద్యార్థి

విశాలాంధ్ర-శృంగవరపుకోట: శృంగవరపు కోట మండలం, ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థి పట్నాన సత్యన్నారాయణ ఎస్.జి.ఎఫ్ అండర్-19 రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ 4 %ఠ% 100 మీటర్ల పరుగు పోటీలలో బంగారు పతకం సాధించి ఈనెల 26వ తేదీ నుండి 29 తేది వరకు మహారాష్ట్రలోని నాగపూర్ లో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ పొట్నూరు శ్రీరాములు శనివారం తెలిపారు. సత్యనారాయణ గుంటూరు జిల్లా నరసరావుపేట స్టేడియంలో జరిగిన రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ అథ్లెటిక్స్ పోటీలలో ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఎంపికైన సత్యనారాయణ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరఫున ఎస్ జి ఎఫ్ అండర్-19 అథ్లెటిక్స్ పోటీలలో ప్రాతినిధ్యం వహిస్తాడు. సత్యనారాయణను పాఠశాల ప్రధానోపాధ్యాయులు బంగారు ఉమామహేశ్వరరావు, ఫిజికల్ డైరెక్టర్ లోకిరెడ్డి కృష్ణ , స్టాఫ్ సెక్రెటరీ వి.ఇ. సత్యన్నారాయణ, ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేస్తూ జాతీయ స్థాయిలో కూడా మంచి పేరు ప్రఖ్యాతులు కనబరచాలని, ఇటు పాఠశాలకు జిల్లాకు, రాష్ట్రానికి మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు.

క్రీడలతో శారీరక, మానసిక దృఢత్వం : డా. పొట్నూరు

విశాలాంధ్ర-శృంగవరపుకోట : క్రీడలతో శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం పెరుగుతుందని డాక్టర్ పొట్నూరు వరలక్ష్మి అన్నారు. డాక్టర్ వరలక్ష్మి సీబీఎస్ఈ పబ్లిక్ పాఠశాలలో ఫిట్ ఇండియా, పాఠశాల వార్షికోత్సవ కార్యక్రమాలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వరలక్ష్మి పబ్లిక్ స్కూల్ వ్యవస్థాపకులు డాక్టర్ వరలక్ష్మి క్రీడా జ్యోతిని వెలిగించి క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ వరలక్ష్మి మాట్లాడుతూ క్రీడల్లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించే విద్యార్థులకు పై చదువులతో పాటు ఉద్యోగాలకు క్రీడా ధ్రువపత్రాలు ఉపయోగ పడతాయని స్పష్టం చేశారు. సీబీఎస్ఈ పాఠశాల ప్రిన్సిపాల్ కండిపల్లి రమేష్ మాట్లాడుతూ విద్యార్థులు గెలుపు, ఓటములను సమాన స్థాయిలో స్వీకరించాలని పిలుపునిచ్చారు. క్రీడలు వలన మానసిక స్థైర్యం పెరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వరలక్ష్మి వ్యాయమ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భార్గవ్ రామ్, పాల్గొన్నారు. కాగా రన్నింగ్, త్రో బాల్, బాస్కెట్ బాల్, వాలీబాల్ వంటి ఆటలు పోటీలు నిర్వహించారు.

19, 20, 21 తేదీలలో
రాష్ట్రస్థాయి మహిళా కబడ్డీ పోటీలు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : ఈనెల 19, 20, 21 తేదీలలో రాష్ట్రస్థాయి మహిళా కబడ్డీ పోటీలను నిర్వహించనున్న నేపథ్యంలో, ఇందుకు సంబంధించిన పోస్టర్లను వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రాంతీయ వ్యవహారాల ఇన్చార్జి వైవి సుబ్బారెడ్డి, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి ఆవిష్కరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి మహిళా కబడ్డీ పోటీలు జరుగనున్నాయి. స్థానిక మహిళా పార్కులో ఈ మేరకు పోటీల సన్నాహాలను చేపడుతున్నారు.కబడ్డీ పోటీల వివరాలు, నిర్వహించనున్న తీరును డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, వై వి సుబ్బారెడ్డికి వివరించారు. మొదటి బహుమతిగా 50వేల, రెండవ బహుమతిగా 40 వేలు, మూడో బహుమతిగా 30 వేలు,నాలుగో బహుమతిగా 20 వేలు చొప్పున ప్రోత్సాహక నగదు బహుమతులను అందించనున్నామని తెలిపారు. రాష్ట్రస్థాయి మహిళా కబడ్డీ పోటీలు నిర్వహించడం అభినందనీయమని వైవి సుబ్బారెడ్డి సందర్భంగా పేర్కొన్నారు. మహిళా సాధికారతకు కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి జన్మదిన కానుకగా రాష్ట్రస్థాయి మహిళా కబడ్డీ పోటీలు నిర్వహించడం సముచితమని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ సభ్యులు బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే బడుకొండ అప్పలనాయుడు, మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ లయా యాదవ్ పాల్గొన్నారు.

'అంగన్వాడీ' సమస్యలపై వినతి పత్రం అందజేత

ఈ ఉద్యమం ఆగదు ప్రధాన కార్యదర్శి పిఎస్వికె వరలక్ష్మి

విశాలాంధ్ర-గరివిడి : మండలం.. లో గత 5 రోజులుగా మా ""అంగన్వాడీ"" సమస్యల మీద శాంతియుత సమ్మె చేస్తున్నాము.., అయినా మా సమస్యలు తీర్చగా పోగా మా అంగన్వాడీ సెంటర్ తాలాలు పగలు కొట్టి స్వాధీనం చేసుకున్నారు.., మేము గ్యాస్., కూరగాయలు..,అంగన్వాడీ సెంటర్ అద్దె., మరియు అందులో సామానులు మా సొంత డబ్బులు పెట్టి కొన్నాం.., వాటి బిల్లులు ఇంతవరకు రాలేదు. కావున మా సమస్యలు, మా బాధలు ప్రభుత్వం అర్థం చేసుకొని పరిష్కారం చూపాలని కోరుతూ గరివిడి., గుర్ల మండలం నుంచి కార్యకర్తలు., అంగన్వాడీ ప్రధాన కార్యదర్శి పిఎస్వికె వరలక్ష్మి అధ్యక్షతన వినతి పత్రంను ఎంఆర్ఓ గోవిందు, మరియు ఎంపిడిఓ భాస్కర్ రావ కు వినతిపత్రం అందజేశారు.

జనవరి 22, 23, 24 తేదీల్లో శంబర పొలమాంబ జాతర

రాష్ట్ర ఉత్సవంగా శంబర పోలమాంబ జాతర

విశాలాంధ్ర-పార్వతీపురం/మక్కువ: ఉత్తరాంధ్రలో ప్రఖ్యాతి గాంచిన శంబర పోలమాంబ జాతర మహోత్సవాలు రాష్ట్ర ఉత్సవంగా జనవరి 22,23,24 తేదీల్లో నిర్వహించుటకు నిర్ణయించడం జరుగుతుందని రెవిన్యూ డివిజనల్ అధికారి కె హేమలత తెలిపారు. మక్కువ మండలం శంబర జాతరపై పార్వతీపురం రెవిన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో శనివారం రెవిన్యూ డివిజనల్ అధికారి (ఆర్.డి.ఓ) అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆర్.డి.ఓ మాట్లాడుతూ జాతర ప్రశాంతంగా సజావుగా జరగాలన్నారు. జాతరకు వచ్చే ప్రతి భక్తుడు, భక్తురాలు పూర్తి సంతృప్తితో తిరిగి వెళ్లాలని అందుకు అందరూ సమన్వయంతో కృషిచేయాలని ఆమె కోరారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా చూడాలని ఆమె పేర్కొన్నారు. రాష్ట్రం నుండి మాత్రమే కాకుండా ఇతర రాష్ట్రాల నుండి పెద్ద ఎత్తున లక్షలాదిగా భక్తులు తరలివస్తారని అందుకు తగిన ఏర్పాట్లు ఉండాలని ఆమె స్పష్టం చేశారు. గత అనుభవాల దృష్ట్యా లోపాలను సవరించుకుంటూ విజయవంతంగా చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు. పోలీస్ బందోబస్తు తగినంత ఏర్పాటు చేసి, ఎటువంటి సంఘటనలు జరగకుండా చూడాలని పోలీస్ శాఖను కోరారు. తాగు నీటి సరఫరాలో ఎటువంటి ఇబ్బందులూ ఉండరాదని ఆమె అన్నారు. కొలాయిలు, బోర్లు పూర్తి స్థాయిలో పనిచేయాలని ఆమె ఆదేశించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా మరుగుదొడ్లు సిద్దం చేయాలని ఆమె అన్నారు. గుడికి దగ్గరలో ఉండే గోముఖి నది ప్రవాహాన్ని గమనిస్తూ భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆమె పేర్కొన్నారు. పారిశుధ్యం పక్కాగా ఉండాలని, పార్వతీపురం, సాలూరు మున్సిపాలిటీల నుండి కార్మికులు, వాహనాలను పంపించాలని ఆమె అన్నారు. జాతర అనంతరం గ్రామంలో పూర్తి పారుశుధ్యం నెలకొనాలని ఆమె స్పష్టం చేశారు. పారుశుధ్యం సక్రమంగా లేకపోవడం వలన తదుపరి రోజుల్లో వ్యాధులు ప్రభలే అవకాశం ఉందని అన్నారు. అమ్మవారి మారు జాతర ముగిసే మార్చి నెల వరకు ప్రతి మంగళవారం పారుశుధ్యంపై దృష్టి సారించాలని ఆమె స్పష్టం చేశారు. పార్కింగ్ స్థలాలు, వాటికి ప్రవేశం, బయటకు వెళ్లే మార్గాలు పక్కాగా ఉండాలని, అచ్చట స్వచ్ఛంద కార్యకర్తలు ఉండాలని ఆమె పేర్కొన్నారు. అత్యవసర సమయంలో అంబులెన్సులు వెళ్ళుటకు రహదారి అందుబాటులో ఉండాలని ఆమె స్పష్టం చేశారు. వైద్య ఆరోగ్య శాఖ వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని ఆమె అన్నారు. అత్యవసర పరిస్థితులలో అవసరమగు అన్ని మందులు శిబిరాల్లో అందుబాటులో ఉండాలని ఆమె పేర్కొన్నారు. ఫీడర్ అంబులెన్సు లు ఏర్పాటు చేయాలని ఆమె సూచించారు. నిరంతర విద్యుత్ సరఫరాలో జాగ్రత్తలు పాటించాలని అన్నారు. సిరిమాను తిరిగే రోజున విద్యుత్ సరఫరా నిలుపుదలలో మరిన్ని జాగ్రత్తలు పాటించాలని ఆమె ఆదేశించారు. అవసరమగు విద్యుత్ సరఫరాకు అదనపు ట్రాన్స్ ఫార్మర్ లు ఏర్పాటు చేయాలని, ప్రతి రహదారి వంపు (కర్వ్) వద్ద విద్యుత్ కాంతులు ఉండాలని ఆమె అన్నారు. దెబ్బతిన్న స్తంభాలను తొలగించాలని ఆమె పేర్కొన్నారు. వనం గుడి వద్ద తక్కువ ఎత్తులో విద్యుత్ తీగలు ఉన్నాయని, వాటిపై చర్యలు తీసుకోవాలని అన్నారు. అగ్నిమాపక యంత్రాలను ఏర్పాటు చేయాలని ఆమె సూచించారు. ప్రజలకు సమాచారం ఇచ్చుటకు, సమాచారం స్వీకరించుట మైక్ ల ద్వారా ప్రకటించుటకు పబ్లిక్ అడ్రస్ సిస్టం ఏర్పాటు చేయాలని ఆమె అన్నారు. కంట్రోల్ ఏర్పాటు చేసి అచ్చట నుండి సమాచారం అందించాలని సూచించారు. మైక్ ద్వారా ఇచ్చే సమాచారం జాతర జరిగే మొత్తం ప్రాంతంలో వినిపించాలని ఆమె అన్నారు. రవాణాకు ఎటువంటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని రహదారులు భవనాలు శాఖను సూచించారు. వచ్చే భక్తులకు రవాణా సౌకర్యం ఇబ్బందులు ఉండకుండా తగిన బస్సులు ఏర్పాటు చేయాలని ప్రజా రవాణా శాఖను సూచించారు. దేవదాయ శాఖ అవసరమగు సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని, కొబ్బరి కాయ కొట్టడాలు కొట్టే స్థలం, చెప్పులు విడిచే స్థలం భక్తులకు విధిగా తెలియాలని, ప్రసాదం తయారీలో పరిశుభ్రత విధిగా పాటించాలని - ఎటువంటి కల్తీ జరగకుండా కట్టు దిట్టమైన చర్యలు తీసుకో వాలని ఆమె ఆదేశించారు. ప్రసాదం కౌంటర్లు ఏర్పాటు చేయాలని ఆమె అన్నారు. సిసి టీవిలు ఏర్పాటు చేయాలని ఆమె సూచించారు. జిల్లా దేవదాయ అధికారి డివివి ప్రసాద్ రావు జాతర తేదీలను వివరించారు. ఈ నెల 18న పెద్దమ్మ వారి చాటింపుతో ప్రారంభమై 2024 మార్చి 26వ తేదీన జరిగే చండి హెూమం, మహాన్నదానంతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు. ప్రధానంగా జనవరి 22వ తేదీన తోలెళ్ళ ఉత్సవం, 23న అమ్మవారి సిరిమాను ఉత్సవం, 24న అనుపోత్సవం జరుగుతాయని చెప్పారు. జనవరి 30వ తేదీ మంగళ వారం నుండి మార్చి 26వ తేదీ మంగళ వారం వరకు మారు జాతర పది వారాలు జరుగుతాయని ఆయన వివరించారు. డీఎస్పీ జి మురళీధర్ మాట్లాడుతూ 4గురు డీఎస్పీలు, 12 మంది ఇన్స్పెక్టర్ లు, 38 మంది ఎస్ఐ లతో సహా మొత్తం 673 మందిని గత ఏడాది బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ఈసమావేశంలో జిల్లా విపత్తు స్పందన అధికారి కె శ్రీనివాస బాబు, జిల్లా గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారి ఓ ప్రభాకరరావు, ప్రజా రవాణా డిపోమేనేజర్ ఈకెకె దుర్గ, వైద్య శాఖ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఎం వినోద్ కుమార్,సాలూరు మండల తహశీల్దార్ ఆర్. బాలమురళికృష్ణ, మక్కువ మండల అభివృద్ధి అధికారి పి. దేవకుమార్, శంబర పోలమాంబ దేవాలయాల ఈఓ వివి. నారాయణ, శంబర పోలమాంబ అమ్మ వారిదేవస్థానం మాజీ చైర్మన్ పూడి దాలినాయుడు, శంబర ఎంపిటిసి తీళ్ళ పోలినాయుడు , ఉత్సవ కమిటీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

అందుబాటులోకి సోచ్ రెడ్ డాట్ సేల్

విశాలాంధ్ర-విజయనగరం: మునుపెన్నడూ లేనంత మెరుగ్గా సోచ్ రెడ్ డాట్ సేల్ తిరిగి వచ్చింది. వివిధ రకాల ఎత్నిక్ వేర్ లుక్‌లను 50 శాతం తగ్గింపుతో అందిస్తోంది. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ రెడ్ డాట్ సేల్ నుండి, చీరలు, సల్వార్ సూట్లు, కుర్తాలు, కుర్తా సెట్‌లు, డ్రెస్ మెటీరియల్‌లు, ట్యూనిక్స్ కఫ్తాన్‌లతో సహా మీకు ఇష్టమైన అన్ని సోచ్ లుక్‌లను ఎంపిక చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నాయి. భారతదేశపు ప్రముఖ ఈవెనింగ్ మరియు అకేషన్ వేర్ బ్రాండ్ అయిన సోచ్, మిలియన్ల కొద్దీ తమ విశ్వసనీయ కస్టమర్‌లకు ఎత్నిక్ కలెక్షన్ కు సంబంధించి సాటిలేని డీల్‌లను పొందే అవకాశంతో ఈ ద్వై-వార్షిక విక్రయాన్ని ప్రకటించింది. ఇది వివాహానికి చీర అయినా, మీ ఈవెనింగ్ సోయిరీకి స్టైలిష్ సల్వార్ సూట్ అయినా లేదా మీ శీతాకాలపు వార్డ్‌రోబ్ లో గ్లామర్‌ను నింపేందుకు అధునాతన కుర్తా అయినా, ప్రతి ప్రత్యేక సందర్భం కోసం రూపొందించిన అద్భుతమైన ఎంసెట్‌ల శ్రేణిని ఇక్కడ కనుగొనవచ్చు. ఈ ప్రత్యేక విక్రయం కేవలం షాపింగ్ అనుభవం మాత్రమే కాకుండా విస్తృత శ్రేణిలో 50 శాతం వరకు తగ్గింపును అందిస్తోంది.

అంగన్వాడి కేంద్రాలు తెరుచుకోకున్నా పట్టని ఐసిడిఎస్అధికారులు



విశాలాంధ్ర-కొమరాడ: గత ఐదు రోజుల నుండి అంగన్వాడి కార్యకర్తలు ధర్నాలు చేస్తున్న సంగతి తెలిసిందే. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల ప్రకారం రాష్ట్రంలో ఏ ఒక్క అంగన్వాడి కేంద్రం మూతపడకుండా చూడవలసిన బాధ్యత ఉన్నత అధికారులపై ఉన్నప్పటికీ కొమరాడ మండలంలో దీనికి విరుద్ధంగా ఉన్నత అధికారులు పనిచేస్తున్నారు మండలంలో కోటిపాము పంచాయితీ ఉన్న రెండు అంగన్వాడి కేంద్రాలు తెరచుకోలేదు. కనీసం ఐదు రోజుల నుండి పిల్లలకు గుడ్లు పాలు చట్నీలు అందించవలసిన బాధ్యత అంగన్వాడి అధికారులకి ఉన్నప్పటికీ కనీసం కేంద్రాలే తెరచుకోకపోవడం పరిస్థితి ఏర్పడింది. అలాగే రాష్ట్ర ప్రభుత్వం మండలంలో ఒక కమిటీ ఏర్పాటు చేసి ఈ కమిటీకి ఉన్నత అధికారులుగా ఎంపీడీవో వెలుగు ఏపీఎం ఐసిడిఎస్ పిఓ గ్రామ పోలీస్ అధికారి గ్రామ వాలంటరీ కలిపి ఒక టీంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అంగన్వాడి కేంద్రంలో వెళ్లే పిల్లలకు మధ్యాహ్న భోజనం పెట్టవలసిన బాధ్యత అధికారులకి ఉన్నప్పటికీ ప్రభుత్వంలో పని చేస్తున్న ఏ ఒక్క అధికారి పిల్లలపై బాధ్యత లేదు. కావున నిర్లక్ష్యంగా పనిచేస్తున్న అంగన్వాడి సూపర్వైజర్ కనీసం పరిశీలించకపోవడం దీనికి విడ్డూరంగా అధికారులు వ్యవహరించడంపై పిల్లల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. దీనిపై ఉన్నత అధికారి ఎంపీడీవో వివరణ కోరగా ఈ సూపర్వైజర్ కి నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడం వల్ల జిల్లా ఉన్నత అధికారులకు నివేదిక పంపిస్తామని తెలిపారు.

విబిఎస్‌వైలో 25 వేల మందికి వైద్య తనిఖీలు

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో నిర్దేశించిన వైద్య పరీక్షలను పక్కాగా నిర్వహించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి. జగన్నాథరావు అన్నారు. ఈ మేరకు ఆయన సివిని గ్రామంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర (విబిఎస్ వై)కార్యక్రమాన్ని శనివారం పరిశీలించారు. అక్కడ ప్రజలకు వైద్య సిబ్బంది నిర్వహిస్తున్న పరీక్షలను, వాటి నివేదికల వివరాలను పరిశీలించారు. ఎంత మందికి క్షయ నిర్ధారణ పరీక్షలు, సికిల్ సెల్ అనీమియా నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు, వీరి లో ఎంతమందిని రిఫర్ చేశారు, పిఎం జనారోగ్య యోజన కార్డులను ఎంతమందికి అందజేశారు తదితర అంశాలపై వైద్య సిబ్బందిని ఆరా తీశారు. ఈ సందర్భంగా డాక్టర్ జగన్నాథరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన విబిఎస్ వై కార్యక్రమం గత నెల 15వ తారీఖు నుండి ప్రారంభమైందని, ఈ కార్యక్రమం ద్వారా గ్రామ పంచాయతీ స్థాయిలో నిర్దేశించిన వైద్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లాలో రోజుకు ఎనిమిది క్యాంపులు చొప్పున నాలుగు మండలాల్లో కొనసాగిస్తున్నామని ఇందుకు నాలుగు వాహనాల ద్వారా వైద్య సేవలను ఆయా పంచాయతీ గ్రామాల్లో నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 180 విబిఎస్ వై క్యాంప్ లను నిర్వహించడం జరిగిందని,ఇందులో 25,471 మందికి ఆరోగ్య తనిఖీలు నిర్వహించగా వీరిలో 2483 మందికి క్షయ నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా, 451 మందిని రిఫర్ చేయడం జరిగిందని, 719 మందికి సికిల్ సెల్ అనీమియా నిర్ధారణ పరీక్షలు జరుపగా 5 మందిని రిఫర్ చేయడం జరిగిందని, 7025 మందికి పిఎం జనారోగ్య యోజన కార్డులను పంపిణీ చేయగా కొత్తగా 441 క్రియేట్ చేయడమైనదని అన్నారు. కార్యక్రమం ద్వారా ఇప్పటి వరకు 13,281 మందికి బిపి తనిఖీలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ ఎమ్. శిరీష, సర్పంచ్ బి.పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

పభుత్వ జూనియర్ కళాశాలలో 2018లో స్టూడెంట్ లీగల్ లిటరసీ క్లబ్ ప్రారంభం

విశాలాంధ్ర-బెలగాం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2018వ సంవత్సరంలో స్టూడెంట్ లీగల్ లిటరసీ క్లబ్‌ను ప్రారంభించడం జరిగింది. పార్వతీపురం అడిషనల్ జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ డి.సౌజన్య శనివారం కళాశాలలోని లీగల్ లిటరసీ క్లబ్ ను సందర్శించారు. ఆ క్లబ్ ద్వారా కళాశాలకు సమకూర్చిన మ్యాగజైన్లు, కంప్యూటర్ తదితర వస్తువులను పరిశీలించి అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. వారికి ఏవైనా సమస్యలు ఉన్నాయా అన్న విషయాన్ని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు బాగా చదివి జీవితంలో ఉన్నతస్థాయికి ఎదగాలని వారికి తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ ఆకుల రాజు, కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : విజయదుర్గ యూత్ సొసైటీ,విజయనగరం యూత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక తోటపాలెం సత్య డిగ్రీ కళాశాలలో డాక్టర్ బొత్స సందీప్ జన్మదినోత్సవ సందర్భంగా ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరంలో సుమారు 35 మంది యువతీ యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా విచ్చేసిన సీతం కళాశాల డైరెక్టర్ మజ్జి శశిభూషణ్ రావు మాట్లాడుతూ ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయొచ్చు అని తెలియజేశారు. రక్తదానం యొక్క ఆవశ్యకతను విద్యార్థులకు తెలిపారు సేకరించిన రక్త నిలవలను విజయ బ్లడ్ బ్యాంక్ కి అందజేశారు. కార్యక్రమంలో సత్య డిగ్రీ కళాశాల ఎన్ సి సి అధ్యాపకులు మీసాల సత్యవేణి, సూరప్ప నాయుడు, విజయ దుర్గ యూత్ సొసైటీ అధ్యక్షులు కేశపట్నం చంద్రిక, విజయనగరం యూత్ ఫౌండేషన్ అధ్యక్షులు షేక్.ఇల్తామష్, సభ్యులు అశోక్,సాయి, రాయల్ క్యాబ్స్ శరత్, రఘు,పూర్ణ, సాయి షణ్ముఖ తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసా కేంద్రాలను సద్వినియోగపరచుకోవాలి

ఐటీడీఏ పిఓ కల్పనా కుమారి

విశాలాంధ్ర-సీతంపేట: ధాన్యం కొను గోలుపై రైతులకు అవగాహన కల్పించాలి అని ఐటీడీఏ పీవో తెలిపారు. సీతంపేట మండలం కుసిమి గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఐటిడిఎ పీవో కల్పనకుమారి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. రైతు భరోసా కేంద్రాలను సద్వినియోపరుచుకోవాలని, కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం ధరల పట్టికపై రైతులకు అవగాహన కల్పించాలని అన్నారు. అదే విధంగా ధాన్యం కొనుగోలుపై ప్రజలకు అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ సిబ్బందికి సూచించారు. ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పీఏవో హరిక్రిష్ణ, మండల వ్యవసాయ శాఖ అధికారి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలి

పాలకొండ నియోజకవర్గ ఇంచార్జ్ నిమ్మక జయకృష్ణ

విశాలాంధ్ర-సీతంపేట: ఐటిడిఏ ఆడవి తల్లి ముఖద్వారం వద్దచేపట్టిన అంగన్వాడీల దీక్షకు వద్దకు టిడిపి బృందం పాలకొండ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ నిమ్మక జయకృష్ణ పాల్గొని వారికి మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంగన్వాడి కార్యకర్తలు యొక్క న్యాయమైన కోరికలు తీర్చాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. ఈ జగన్ ప్రభుత్వం అందర్నీ మోసం చేసినట్టుగానే అంగన్వాడీలను కూడా మోసం చేసిందని, వారికి పనికి తగ్గ వేతనం ఇవ్వలేదని ఎన్నికల హామీల్లో భాగంగా అంగన్వాడిలకు వేతనాలు పెంచి గ్రాడ్యుటి ఇస్తానని మాట తప్పి మడమతిప్పాడని అంగన్వాడి వర్కర్లను వెంటనే ఆదుకుని వారి సమ్మె విరమింప చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని,లేకపోతే టిడిపి జనసేన తరఫున భారీ ఎత్తున ఉద్యమం చేస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కర్నేన అప్పలనా యుడు, సీతంపేట మండల పార్టీ అధ్యక్షులు సవరతోటమొఖ లింగం,భవిష్యత్తు గ్యారెంటీ ప్రచారకర్త తోయిక సంధ్యారాణి,బీసీ సెల్ అధ్యక్షులు ఆర్ రంగనాథం, ఐటిడిపి కోఆర్డినేటర్ ఇమరక పవన, యూనిట్ ఇంచార్జ్ బిడ్డిక ప్రవీణ్ సాయి నియోజకవర్గ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

అన్నయ్య జ్ఞాపకార్థం సుందరీకరణ

విశాలాంధ్ర-భోగాపురం: దివంగత వరుపుల శ్రీనివాసరావు జ్ఞాపకార్థం అతని తమ్ముడు గిరిబాబు భోగాపురం గ్రామాన్ని సుందరీకరించడం స్ఫూర్తిదాయకం అని తెలగా సంఘ నాయకుడు పల్లంట్ల వెంకట రామారావు అన్నారు. శనివారం భోగాపురం గ్రామంలో వరుపుల గిరి బాబు చేపట్టిన పలు అభివృద్ధి పనులను సందర్శించి అయన ప్రారం భించారు. ఈ సందర్భంగా వెంకట రామారావు మాట్లాడుతూ అన్నశ్రీనివాసరావు జ్ఞాపకార్థం గిరిబాబు గ్రామంలో చెరువు గట్లు పై మొక్కలు పరిసరాలను పచ్చదనంతో నింపి, అందరు సేదతీరడానికి సిమెంట్ బల్లలు ఏర్పాటు చేయడం నిజంగా అబినందించవలసిన విషయమని అయన అన్నారు. అలాగే స్మశానాలను శుభ్రపరచి మొక్కలు నాటి సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేసి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని సృష్టించాడని ఇది మంచి విషయమని అన్నారు. మునుముందు గిరిబాబు ఇంకా ఎన్నో మంచి పనులు చేసి యువతకు ఆదర్శంగా నిలవాలని అన్నారు. అలాగే గిరిబాబుని ప్రత్యేకంగా అభినందిస్తూ అన్ని వేళల సహాయ సహకారాలు అందించి వెన్నంటే ఉంటామని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర యాదవ సంఘం ఈసారపు శేఖర్ యాదవ్, పల్లంట్ల చిన్న,గ్రామస్తులు ఆళ్ల ఉదయబాబు, ఆళ్ల సురేష్, జక్కాపు రవి, గుండాల లోకేష్, ఇమ్మిడిశెట్టి ప్రసాద్, గిరిబాబు,బొల్లు త్రినాథ్,సిరుగుడి వాసు తదితరులు పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనులకు మేయర్ విజయలక్ష్మి శంకుస్థాపన



విశాలాంధ్ర-విజయనగరం టౌన్: నగరం లోని వివిధ ప్రాంతాలలో చేపట్టనున్న అభివృద్ధి పనులకు మేయర్ విజయలక్ష్మి శంకుస్థాపన చేశారు. 14వ డివిజన్లో 5 లక్షల రూపాయలతో ఏర్పాటు చేయనున్న పశువుల కొట్టాం నకు, అలాగే 20వ డివిజన్లో కొత్త అగ్రహారంలో 8 లక్షలతోనూ రహదారులు, కాలువల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగర అభివృద్దే ధ్యేయంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి సలహాలు, సూచనలతో కృషి చేస్తున్నామన్నారు. నగరంలో విచ్చలవిడిగా పశువుల సంచారాన్ని అరికట్టేందుకు పశువుల కొట్టాంను కొత్తపేటలో ఏర్పాటు చేస్తున్నామన్నారు. అలాగే రహదారులు, కాలువలను కొత్తాగ్రహారంలో ఏర్పాటు చేయడం ద్వారా ప్రజలకు మరింత సౌకర్యవంతమైన సేవలు అందించే ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. నగరంలో అన్ని ప్రాంతాలలో మౌలిక సదుపాయాలు కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు అందరి సహకారంతో నగరాన్ని మరింత అభివృద్ధి దిశగా తీర్చిదిద్దుతామని చెప్పారు. డిప్యూటీ మేయర్ ముచ్చు లయా యాదవ్ మాట్లాడుతూ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో నగరంలో అభివృద్ధి శర వేగంగా సాగుతుందన్నారు. ప్రజలు ఏ సమస్యను చెప్పిన వాటిని పరిష్కరించేందుకు అధిక ప్రాధాన్యత నిస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో మరోసారి శాసనసభ్యులుగా కోలగట్ల వీరభద్రస్వామిని గెలిపించినట్లయితే నగరాన్ని సమస్యలు లేని నగరంగా తీర్చిదిద్దుతారనడంలో సందేహం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఫ్లోర్ లీడర్ ఎస్వివి రాజేష్, నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వెంకటేశ్వర దేవాలయంలో అన్న ప్రసాదం వితరణ

విశాలాంధ్ర - సీతంపేట: మండల కేంద్రం లో గల శ్రీ వెంకటేశ్వర దివ్య క్షేత్రం తిరుమల తిరుపతి దేవస్థానం నందు అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. సుమారు 750 మందికి పాలకొండకి చెందిన వెంకట సత్య లక్ష్మీ ప్రసాద్ (బాలు), వెంకటలక్ష్మి కుటుంబ సభ్యు లచే అన్న ప్రసాద వితరణ కార్యక్రమం జరిపించడం జరిగింది. ఈ కార్యక్రమానికి విచ్చేసిన భక్తులు వెంకటే శ్వర స్వామి దర్శించుకుని ఆయన కటాక్షాన్ని పొంది పునర్ దర్శనం పొందాలని ప్రార్దించారు. కార్యక్రమంలో టెంపుల్స్ ఇన్స్పెక్టర్ రిటైర్డ్ ప్రిన్సిపాల్ మజ్జి సత్యం, ఐ. ప్రసాదరావు, దేవాలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

నాటు సారాపై దాడులు

ఐదుగురిపై కేసు నమోదు

విశాలాంధ్ర- పార్వతీపురం టౌన్: జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ విక్రాంత్ పాటిల్, స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో అడిషనల్ ఎస్పీ దిలీప్ కిరణ్ ఆదేశాల మేరకు ఆంధ్రా ఒడిషా రాష్ట్ర సరిహద్దుల్లో కొమరాడ మండలం లంజి గ్రామ అటవీ ప్రాంతంలో అక్రమంగా నాటుసారా తయారీ చేస్తున్నారన్న సమచారం మేరకు దాడులు చేసి 2800 లీటర్ల నాటు సారా తయారు చేసే బెల్లపు ఊట,20 లీటర్ల నాటు సారా మరియు వంట పాత్రలు ధ్వంసం చేసి లంజి గ్రామానికి చెందిన నందేసు గణేష్ అను వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎల్ ఉపేంద్ర తెలిపారు. అలాగే ఒడిషా రాష్ట్రం నుండి ఆంధ్ర ప్రాంతం గుమడ గ్రామానికి కాలి నడకన ఒడిషా కూలీల ద్వారా నాటు సారా రవాణా జరుగుతుందన్న సమాచారం మేరకు కొమరాడ మండలం గుమడ అగ్రహారం రైల్వే బ్రిడ్జి సమీపంలో మాటువేసి 200 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకుని గుమడ గ్రామానికి చెందిన బంగారి జనని, సిరిపురపు రవి, దేవుపల్లి శివుడు మరియు నాటు సారా సరఫరా దారుడు ఒడిషా రాష్ట్రం జయకోట గ్రామానికి చెందిన బిడ్డిక చెల్లయ్య అలియాస్ సురేష్ అను వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయడం జరుగుతుందన్నారు. ఈ దాడుల్లో స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో ఎస్ఐ వి వి రమణ, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, కానిస్టేబుల్స్ సత్యన్నారాయణ, అప్పారావు సూర్యనారాయణ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సిబ్బంది సమ్మెకు టీడీపీ, జనసేన మద్దతు

విశాలాంధ్ర-జామి: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ 5రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలుకు మద్దతుగా జామి మండల టీడీపీ, జనసేన నేతలు సంఘీభావం వ్యక్తం చేసారు. ఈమేరకు శనివారం జామిలోని అంగన్‌వాడీ సిబ్బంది సమ్మె చేస్తున్న తహశీల్దార్ కార్యాలయం ఎదుట శిబిరం వద్దకు వచ్చిన టీడీపీ, జనసేన నేతలు ధర్నాలో పాల్గొన్నారు. ఈసందర్భంగా టీడీపీ నేతలు మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరడం అంగన్‌వాడీ కార్యకర్తల హక్కు అన్నారు. చేతగాని వాగ్దానాలను చేసి మడమ తిప్పే ఇటువంటి ముఖ్యమంత్రి వలన అనేక వర్గాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. న్యాయంగా ఉన్న వారి డిమాండ్‌లను వెంటనే పరిష్కరించి సమ్మెను విరమింపజేసేలా ప్రభుత్వం ప్రయత్నించాలన్నారు. కానీ అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు పగులగొట్టడం వంటి దౌర్జన్యాలను చేయడం ద్వారా ముఖ్యమంత్రి తన అసలు ఫ్యాక్షన్ స్వరూపాన్ని బైటపెట్టారని తెలిపారు. అంగన్‌వాడీలకు మద్దతు తెలిపిన వారిలో మాజీ జెడ్‌పిటిసి బందారుపెదబాబు, పార్లమెంటరీపార్టీ మహిళాకార్యదర్శి,10వ క్లస్టర్ ఇన్‌చార్జి మాకిరెడ్డి శ్రీలక్ష్మి, కొత్తలిసూర్యారావు, మండలపార్టీఅధ్యక్షుడు పోలిపర్తి స్వామినాయుడు, ప్రధానకార్యదర్శులు దనియాల పైడిరాజు,వగ్రిరమణ, సీనియర్ నేతలు గనివాడ ఎర్నాయుడు,ముకుందశ్రీను, జనసేన నేత దేగల ఈశ్వరరావు తదితరులు ఉన్నారు.

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించకుంటే పోరాటాలు ఉధృతం చేస్తాం : సిటూ

విశాలాంధ్ర-శృంగవరపుకోట: అంగన్వాడి వర్కర్ల న్యాయమైన సమస్యలు పరిష్కరించకుంటే పోరాటాలు ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కాకి సురేష్, జిల్లా కార్యదర్శి మద్దిల రమణ, యూటీఎఫ్ జిల్లా నాయకులు మెడిశెట్టి కొండలరావు, నారాయణ తదితరులు హెచ్చరించారు. ఎస్.కోట ఐసీడీఎస్ కార్యాలయం ఎదురుగా అంగన్వాడీలు చేస్తున్న సమ్మె శనివారం 5వ రోజుకి చేరుకుంది. వీరి సమ్మెకు సంఘీభావం తెలిపేందుకు విచ్చేసిన సురేష్ తదితరులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళ శిశు సంక్షేమశాఖ కమిషనర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తాళాలు పగలగొట్టి సెంటర్లు తెరవాలని సచివాలయ సిబ్బందికి ఆదేశాలు జారీ చేయడం భావ్యం కాదన్నారు. అంగన్వాడీలు అంటే అంత చిన్నచూపు ఎందుకని అంగన్వాడీలను తక్కువ అంచనా వేయడం ఈ రాష్ట్ర ప్రభుత్వానికి మంచిది కాదని సిఐటియు యూనియన్ గా హెచ్చరిస్తున్నామన్నారు. అంగన్వాడీలకు కనీస వేతనం రూ. 26,000 ఇవ్వాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ అమలు చేయాలని మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా చేయాలని సూచించారు. తెలంగాణలో రూ.13,600 తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీలకు చెల్లిస్తుంది. అలాగే కర్ణాటక ఇతర రాష్ట్రాల్లో అంగన్వాడీలకు గ్రాట్యుటి అమలు చేస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఐదు లక్షల గ్రాట్యుటీ అమలు చేయాలి, రిటైర్మెంట్ వయోపరిమితి 62 ఏళ్లకు పెంచాలి, పెన్షన్వేతనంలో సగం పెన్షన్ రూపంలో ఇవ్వాలి, పీఎఫ్ఈఎస్ఐ అమలుచేయాలి, మినీ వర్కర్లకు మెయిన్ వర్కర్ల వల్లే వేతనాలు చెల్లించాలి, అలాగే హెల్పర్లకు ప్రమోషన్లు నిబంధన రూపొందించాలి, రాజకీయ జోక్యం అరికట్టాలి, ప్రమోషన్ల వయస్సు 50సంవత్సరాలకి పెంచాలి, సర్వీసులో ఉండి చనిపోయిన అంగన్వాడి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలి, బీమా సౌకర్యం కల్పించాలి, వైయస్సార్ సంపూర్ణ పోషణ మెనూ చార్జీలు పెంచాలి, వంట గ్యాస్ ప్రభుత్వమే సరఫరా చేయాలి, పెండింగ్లో ఉన్న సెంటర్ హద్దులు 2017 డిఏ బిల్లులు ఇతర బకాయిలు వెంటనే చెల్లించాలి, లబ్ధిదారులకు నాణ్యమైన సరుకులు సరఫరా చేయాలి, ఎఫ్ ఆర్ ఎస్, వివిధ రకాల యాప్ లో రద్దుచేసి ఒకే యాప్ ద్వారా విధులు విధులు నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలనీ కోరారు. ఈ డిమాండ్లు పరిష్కరించని ఎడల ఇంతవరకు అంగన్వాడీలు మాత్రమే ఈ పోరాటం చేస్తున్నారని, ఇకపై పోరాటానికి గర్భిణీలు బాలింతలు చిన్నపిల్లల తల్లులను ఐక్యం చేసి పెద్ద ఎత్తున ఆందోళన పోరాటం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు చెలికాని ముత్యాలు, అంగన్వాడీ నేతలు డి.శ్యామల డీ. జయలక్ష్మి, ఏఐటీయూసీ నాయకులు వి.మాణిక్యం, బి.సుశీల తదితరులు పాల్గొన్నారు.

టీకాల కార్యక్రమానికి గైర్హాజరైన ఎంఎల్హెచ్పి లు

విశాలాంధ్ర-కురుపాం: కురుపాం మండలం లో గల మొండెంఖల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల పెద గొత్తిలి, మరిపల్లి, గుమ్మ, పి.లేవిడి, జి శివడ, ఉదయపురం, సచివాలయాలు సంబంధించిన ఎం.ఎల్.హెచ్.పి లు శనివారం టీకాల కార్యక్రమానికి హాజరు కాలేదు. టీకాలు వేసే సమయంలో పిల్లలకు ఏడవర్స్ రియాక్షన్ ఒకవేళ వస్తే చిన్నపిల్లలని ఎవరు చూస్తారు. దీనికి బాధ్యత ఎవరు వహిస్తారు. అని అక్కడ ప్రజలు అంటున్నారు. ప్రభుత్వం చిన్న పిల్లలు పట్ల ఎంతో ముందు చూపుతో ఈ టీకాల కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్టత్మాకంగా నిర్వహించడం జరుగుతుంది అని దీనికి కూడా ఎం ఎల్ హెచ్ పి లు హాజరు కాకపోవడం చాలా విడ్డురంగా ఉంది అని ప్రజలు ఆరోపిస్తున్నారు. చిన్న పిల్లల పట్ల ఇలా ఉంటే మా లాంటి పెద్ద వాళ్ళు, వృద్ధులు, నడవలేని వారి పరిస్థితి ఏమిటి అని వాపోయారు...బాధ్యతాయుతంగా పనిచేయాల్సిన ఉద్యోగులు ఈవిధంగా చేయటం సరికాదని పలువురు మండిపడ్డారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన

ఎంపీ జివిఎల్ నరసింహారావు

విశాలాంధ్ర-వేపాడ: వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని రాజ్యసభ సభ్యులు జివిఎల్ నరసింహారావు అన్నారు.మండలంలోని సోంపురం సచివాలయం పరిధిలో శనివారం" వికసిత్ భారత్ సంకల్పయాత్ర" కేంద్ర ప్రభుత్వ పథకాలుపై డిజిటల్ స్క్రీన్ ద్వారా అవగాహన కార్యక్రమం జరిగింది. డిజిటల్ స్క్రీన్ కార్యక్రమం ద్వారా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరించారు. అలాగే ప్రధాని నరేంద్ర మోడీ ఉపన్యాసం వినిపించారు. ఈ కార్యక్రమానికి,డిసిసిబి చైర్మన్ వేచలపు వెంకట చిన రామునాయుడు.గ్రామ సర్పంచ్ మురిపిండి గంగరాజు, ఎంపీటీసీ సభ్యులు ఆకుల సత్యనారాయణ, ఎంపీడీఓ, పట్నాయక్, బిజెపి మండల పార్టీ అధ్యక్షులు గోకేడ మహేష్, గ్రామ పెద్దలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు థర్డ్ పార్టీ విధానం రద్దు చేయాలి

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : ఆర్టీసీ ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు తరుణ్ పార్టీ విధానాన్ని రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ జేఏసీ జనరల్ సెక్రెటరీ భానుమూర్తి తెలిపారు శనివారం నేడు స్థానిక విజయనగరం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఉన్న ప్రైవేట్ హోటల్లో ఆర్టీసీ ఔట్సోర్సింగ్ ఉద్యోగులసమావేశం ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏపీ జెఎసి జనరల్ సెక్రెటరీ భానుమూర్తి, జిల్లా ఔట్సోర్సింగ్ ప్రెసిడెంట్ మహేంద్ర బాబు, ఎంప్లాయిన్ యూనియన్ డిపో సెక్రెటరీ శ్రీనివాసరావు పాల్గొన్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్టీసీలో పని చేస్తున్న ఔట్సోర్సింగ్ సిబ్బందికి థర్డ్ పార్టీ విధానం రద్దు చేసి ఆర్టీసీ సంస్థ ద్వారా జీతాలు ఇవ్వాలని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏపీ సి ఓ ఎస్ ద్వారా వేతనాలు ఇవ్వాలన్నారు.సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ఔట్సోర్సింగ్ జిల్లా అధ్యక్షుడు ఏ అశోక్ డిమాండ్ చేశారు. నూతన కార్యవర్గం జరిగింది ఈ సమావేశంలో తిరుపతిరావు, శివ, జగదీష్ ,రామకృష్ణ, వెంకట్రావు, నరసయ్యమ్మ, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుండి తెరుచుకో నున్న అంగన్వాడీ సెంటర్లు

విశాలాంధ్ర-వంగర: మండలంలోఅంగన్వాడీ సెంటర్లును నేటి ఆదివారం నుండి తెరవ నున్నట్లు అంగన్వాడీ సూపర్ వై జర్ జీ.రామ దుర్గ తెలిపారు. శనివారం ఆమె మండలంలో పలు సెంటర్లను పరిశీ లించినట్లుతెలిసింది. అదివారం నుండి అంగన్వాడీ సెంటర్ల ను తెరచి పిల్లలకు భోజన సౌకర్యాలు కల్పిస్తున్నట్లు ఆమె వివరించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలు మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. పాఠశాల మధ్యాహ్నభోజన పథకం వంటచేసిన వారే అంగన్వాడీ కేంద్రాల పిల్లలకు భోజన ఏర్పాటు చేస్తారని చెప్పారు. ఈ సెంటర్లను సచివాలయ సిబ్బంది ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటలు వరకూ తెరచి ఉంటాయని వివరించారు. ఆదివారం ఉదయం మండలంలో గల 69 సెంటర్లు తాళాలు స్వాధీనం చేసుకొని, అంగన్వాడీ సెంటర్ల నుతెరవ నున్నట్లు అంగన్వాడీ సూపర్ వైజర్ రామ దుర్గ తెలిపారు. గత ఐదు రోజులుగా అంగన్వాడీ కేంద్రాలు కార్యకర్తలు సమ్మె బాట పట్టడం వల్ల అంగన్వాడీ సెంటర్లు మూసుకుపోయిన విషయం విదితమే.ఆదివారం నుండి తెరవ నున్న సెంటర్ల ఏవిధంగా పనిచేయ నున్నాయోవేచి చూడాలి.సెంటర్లు తెరిస్తే ఖబడ్దార్ అంటూ అంగన్వాడీకార్యకర్తలు హెచ్చరికలు చేస్తున్న దృష్ట్యా సెంటర్లు తెరవడం తో పరిస్థితి ఏవిధంగా ఉంటుందో చూడాలి.

అంగన్వాడీ కేంద్రాలు బద్దలు కొట్టిన వారిపై కేసులు నమోదు చేయాలి

విశాలాంధ్ర-నెల్లిమర్ల: అంగన్వాడీ కేంద్రాలకు తాళాలు బద్దలు కొట్టినవారిపై కేసులు నమోదు చేయాలని సిటూ జిల్లా కార్యదర్శి ఎ జగన్మోహన్ రావు కోరారు. నెల్లిమర్ల ఎంపీడీఓకి అంగన్వాడీ లు శనివారం వినతిపత్రం అందిం చారు. ఈ సందర్భంగా జగన్మోహన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ సిఎం ఇచ్చిన హామీలను శాంతియుతంగా సమ్మెను కొనసాగిస్తూ ఉంటే సచివాలయ కార్యదర్శులతో అంగన్వాడీలను నిర్వహించడం దారుణమని చెప్పారు. అధికారులు అంగన్వాడీల న్యాయమైన పోరాటానికి మద్దతు తెలపాలని కోరారు. కార్యక్రమంలో సెక్టార్ నాయకులు రమాదేవి, బంగారు లక్ష్మి, ఆదిలక్ష్మి, భారతి పాల్గొన్నారు.

18న వైయస్ఆర్ ఆరోగ్య శ్రీ పై జేసీ అవగాహన

విశాలాంధ్ర-బెలగాం: వైయస్ఆర్ ఆరోగ్య శ్రీ పై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు తెలిపారు. వైయస్ఆర్ ఆరోగ్య శ్రీ అవగాహనపై జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ సంబంధిత అధికారులతో శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం వైయస్ఆర్ ఆరోగ్య శ్రీ పథకం క్రింద పరిమితిని రూ.25 లక్షలకు పెంచడం జరిగిందన్నారు. ఇది ప్రజలకు ఉపకరించే అంశమని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వైయస్ఆర్ ఆరోగ్య శ్రీ కార్యక్రమంలో 3,257 చికిత్సలను 2,285 ప్రభుత్వ ప్రైవేట్ ఆసుపత్రులలో పొందవచ్చని చెప్పారు. హైదరాబాదు, చెన్నై, బెంగుళూరు వంటి ఇతర రాష్ట్రాల్లోని పెద్ద కార్పొరేట్ ఆసుపత్రులలో సైతం వైద్యం పొందవచ్చని చెప్పారు. వైద్య రంగంలో ప్రభుత్వం విప్లవాత్మక మార్పులు తీసుకురావడం జరిగిందన్నారు. ఫ్యామిలీ డాక్టర్ విధానం, వైఎస్ఆర్ ఆసరా, 104 కాల్ సెంటర్, 108 అంబులెన్సు సేవలు, విలేజ్ హెల్త్ క్లినిక్ తదితర అంశాలతో పాటు ఆసుపత్రిలో అనేక ఉచిత సదుపాయాలను అందించడం జరుగుతుందని వివరించారు.18వ తేదీన జరిగే కార్యక్రమాన్ని ముఖ్య మంత్రి వర్చువల్ విధానంలో ప్రారంభిస్తారని, దానిని జిల్లా, మండల స్థాయిలో ఏర్పాటు చేయాలని అన్నారు. అందుకు ఏర్పాట్లు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని కోరారు. ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి జె. వెంకటరావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. బి. జగన్నాథరావు, ఆరోగ్య శ్రీ జిల్లా సమన్వయ అధికారి డా. కొయ్యాన అప్పారావు, ఎస్డిసి జి. కేశవనాయుడు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు జగన్మోహన్ రెడ్డి తోనే సాధ్యం

ఎమ్మెల్యేశంబంగి

వీశాలాంధ్ర-తెర్లాం : మండలంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తోనే సాధ్యమని స్థానిక ఎమ్మెల్యేశంబంగి. వెంకట చినప్పల నాయుడు, ఆయన సోదరులు వేణుగోపాల్ నాయుడు తెలిపారు. శనివారం సాయంత్రం కూనాయవలస లో బొబ్బిలి మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మి శ్రీనివాసరావు, ఆధ్వర్యంలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రామంలో ఇంటింటికి వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ పార్టీలకతీతంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ప్రభుత్వము అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పై ఆరా తీశారు. ప్రతి గడపలో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలు పట్ల ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారు. స్థానిక నాయకులు సర్పంచ్ బోడెల. విజయ్ బాబు, మాజీ ఎంపిటిసి కర్రి సత్యనారాయణ ఈయనతో ఎంపీపీ ప్రతినిధి నర్సిపల్లి బాబ్జి రావ్, మండల పార్టీ అధ్యక్షులు టి సత్యమనాయుడు, జడ్పిటిసి ప్రతినిధి జి రామారావు, వైస్ ఎంపీపీలు సిహెచ్ సత్యనారాయణ, అప్పలరాజు, తాసిల్దార్ బి రతన్ కుమార్, ఇంచార్జ్ ఎంపీడీవో డివి అప్పారావు మండల స్థాయి అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శి మీసాల అప్ప స్వామి, వాలంటీర్లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు దూరంగా ఉన్నారు.

నోటికి నల్లరిబ్బన్లు కట్టుకొని నిరశన తెలిపిన అంగన్వాడి వర్కర్లు, హెల్పర్లు

విశాలాంధ్ర-బెలగాం: పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు అంగనవాడీల సమస్యల పరిష్కారం కావాలని ప్రొజక్టు లీడర్లు మర్రాపు అలివేలు, సాలూరు గౌరిమణి ఆధ్వర్యంలో చేస్తున్న సమ్మె 5వ రోజు శనివారం నోటికి నల్ల రిబ్బన్లు కట్టుకొని నిరశన వ్యక్తపరిచిన అంగన్వాడి వర్కర్స్ %డ% హెల్పర్స్. ఈ సమ్మెకు సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ, బంకురు సూరిబాబు మద్దతు తెలుపుతూ అంగన్వాడి సమస్యల పరిష్కారం కావాలని న్యాయంగా సమ్మె చేస్తున్నారని, అంగన్వాడీ కేంద్రాలు తాళాలు విరగగొట్టి లోపల చొరబడడం వాళ్ళ డ్యూటీలు వేరే వాళ్ళు చేయడం అనారోగ్యకరమైన వాతావరణమని తాళాలు విరగగొట్టి లోపల ప్రవేశాలు చేయమని మేము చెప్పలేదని రాష్ట్ర మంత్రులు చెప్పినట్టు ప్రముఖ దినపత్రికల్లో వచ్చాయని కావాలనే ఈ రకమైన దుశ్చర్యలు ఇక్కడవారే చేపడుతున్నారని దీనిని ఖండిస్తున్నామని తెలిపారు. అంగన్ వాడి వర్కర్స్ %డ% హెల్పర్స్ సమస్యలు పరిష్కారం కావాలని సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ, అంగన్వాడి ప్రాజెక్టు లీడర్లు అలివేలు, గౌరీమణి ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం నుంచి ఐసిడిఎస్ కార్యాలయం వరకు ప్రదర్శన చేసి అనంతరం ఐసిడిఎస్ పిఓ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ నాయకులు బంకురు సూరిబాబు, కె. రాజేశ్వరి, ఎం. గౌరి, బి. సునీత, శాంతి, అధిక సంఖ్యలో అంగన్వాడి వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు. అంగన్వాడీల సమ్మెకు భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) జిల్లా కన్వీనర్ ఎం. వెంకట్రావు, యుటిఎఫ్ జిల్లా నాయకులు కేశవ నాయుడు మద్దతు తెలియజేశారు.

అంగన్వాడీలకు టీడీపీ సంపూర్ణ మద్దతు

విశాలాంధ్ర-చీపురుపల్లి: గ్రామ వ్యవస్థకు కీలక పాత్ర పోషిస్తున్న అంగన్వాడీ ఉద్యోగస్తులకు, వైయస్సార్ ప్రభుత్వం గత నాలుగేళ్లయిన తీరని అంగన్వాడీ సమస్యలపై గత 5 రోజులు నుంచి అంగన్వాడీ ఉద్యోగస్తులు చేస్తున్న ధర్నాకు తెలుగుదేశం పార్టీ తరపున చీపురుపల్లి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు రౌతు కాము నాయుడు ఆధ్వర్యంలో మద్దతు తెలియజేస్తూ, అంగ న్వాడి ఉద్యోగస్తుల సమస్య పరిష్కారమైనంతవరకు తెలుగుదేశం పార్టీ మద్దతు ఉంటుందని తెలుగుదేశం పార్టీ తోనే మీ సమస్యలు పరిష్కారవుతాయని రౌతు కామునాయుడు తెలియడం జరిగింది. కార్యక్రమంలో చీపురుపల్లి తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు శ్రీ రౌతు కామునాయుడు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు రౌతు నారాయణరావు, పికె పాలవలస మాజీ సర్పంచ్ వలిరెడ్డి శ్రీరాములు నాయుడు గొల్లలములగాం టీడీపీ ప్రెసిడెంట్ గడే సన్యాసప్పల నాయుడు, ఇటకర్లపల్లి సర్పంచ్ అభ్యర్థి మీసాల నవీన్, మాజీ ఎంపీటీసీ ఆరతి సాహు,పెదనడిపల్లి మాజీ ఎంపీటీసీ సప్ప సూరప్పడు, చీపురుపల్లి సర్పంచ్ అభ్యర్థి సబ్బి సోనియా, పేరిపి ఎంపీటీసీ అభ్యర్థి కోరాడ కోటేశ్వరరావు, చీపురుపల్లి నియోజకవర్గ తెలుగుదేశం తెలుగు యువత కార్యనిర్వాహిక కార్యదర్శి గడే సత్యనారాయణ, గడే అప్పల నాయుడు, బుంగ మహేష్,లెంక చిన్నారావు, ఆర్థివలస దన్నాన సంతోష్, శనపతి శ్రీనివాసరావు, శనపతి శంకర్, పొట్నూరు త్రినాథరావు చింతపల్లి రామకృష్ణ, బూరాడ చిన్న, బూరాడ కృష్ణ, గులివిందల శ్రీను కార్యక్రమంలో పాల్గొన్నారు.

25 వేల మందికి వైద్య తనిఖీలు

విశాలాంధ్ర-కొమరాడ: వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో నిర్దేశించిన వైద్య పరీక్షలను పక్కాగా నిర్వహించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి. జగన్నాథరావు అన్నారు. శనివారం సివిని గ్రామంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర (విబిఎస్ వై)కార్యక్రమాన్ని పరిశీలించారు. అక్కడ ప్రజలకు వైద్య సిబ్బంది నిర్వహిస్తున్న పరీక్షలను, వాటి నివేదికల వివరాలను పరిశీలించారు. ఎంత మందికి క్షయ నిర్ధారణ పరీక్షలు, సికిల్ సెల్ అనీమియా నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు, వీరి లో ఎంతమందిని రిఫర్ చేశారు, పిఎం జనారోగ్య యోజన కార్డులను ఎంతమందికి అందజేశారు తదితర అంశాలపై వైద్య సిబ్బందిని ఆరా తీశారు. ఈ సందర్భంగా డాక్టర్ జగన్నాథరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన విబిఎస్ వై కార్యక్రమం గత నెల 15వ తారీఖు నుండి ప్రారంభమైందని, ఈ కార్యక్రమం ద్వారా గ్రామ పంచాయతీ స్థాయిలో నిర్దేశించిన వైద్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లాలో రోజుకు ఎనిమిది క్యాంపులు చొప్పున నాలుగు మండలాల్లో కొనసాగిస్తున్నామని ఇందుకు నాలుగు వాహనాల ద్వారా వైద్య సేవలను ఆయా పంచాయతీ గ్రామాల్లో నిర్వహిస్తు న్నామన్నారు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 180 విబిఎస్ వై క్యాంప్ లను నిర్వహించడం జరిగిందని, ఇందులో 25,471 మందికి ఆరోగ్య తనిఖీలు నిర్వహించగా వీరిలో 2483 మందికి క్షయ నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా, 451 మందిని రిఫర్ చేయడం జరిగిందని, 719 మందికి సికిల్ సెల్ అనీమియా నిర్ధారణ పరీక్షలు జరుపగా 5 మందిని రిఫర్ చేయడం జరిగిందని, 7025 మందికి పీఎం జనారోగ్య యోజన కార్డులను పంపిణీ చేయగా కొత్తగా 441 క్రియేట్ చేయడమైనదని అన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ఇప్పటి వరకు 13,281 మందికి బిపి తనిఖీలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో కొమరాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎమ్ శిరీష, సర్పంచ్ బి.పుష్పలత , పిహెచ్ఎన్ విజయకుమారి, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జరిగిన హోలీక్రాస్ స్కూలు మూడోవార్షికోత్సవ వేడుకలు

విశాలాంధ్ర-సీతానగరం: మండల కేంద్రంలోగల హెూలీక్రాస్ ఇంగ్లీష్ మీడియంపాఠశాల మూడో వార్షికోత్సవ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. పిల్లలు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ముఖ్య అతిథిగా రెవరెండ్ ఫాదర్ వర్గీస్ (సీతానగరంచర్చి), ప్రత్యేక అతిథులుగా తహశీల్దార్ ఎన్వీ రమణ, ఎంపిడిఓ ఎంఎల్ఎన్ ప్రసాద్, మండల విద్యాశాఖాధికారులు జి. సూరి దేముడు, మువ్వల వెంకటరమణలు హాజరయ్యారు.వారు మాట్లాడుతూ ఈసంస్థ ద్వారా గ్రామీణప్రాంతాల విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడం జరుగుతుందన్నారు. సంస్థ సేవలను కొనియాడారు. గ్రామీణ ప్రాంతంలో వెనుకబడిన విద్యార్థులను హెూలీ క్రాస్ స్కూల్ ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దేందుకు చేస్తున్న కృషిని కొనియాడారు.మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులకు, వివిధ పోటీలో పాల్గొని చక్కని ప్రతిభను కనబరిచిన విద్యార్థినీ విద్యార్థులకు బహుమతులు అందజేశారు.ఈకార్యక్రమంలో మేనేజరు సిస్టర్ ఆనంద్ ఎర్నాకల్ ప్రిన్సిపాల్ సిస్టర్ నీలిమగ్రేస్ బిలంగ్, ఉపాధ్యాయ సిబ్బంది, నాన్ టీచింగ్ సిబ్బంది,తల్లిదండ్రులు, పిల్లలు పాల్గొన్నారు.

ఒక్కడినే ఇంటర్వ్యూకు వెళ్లినా వలంటీర్ పోస్ట్ ఇవ్వడం లేదు

- వసి గ్రామ దళిత యువకుడు ఆవేదన

విశాలాంధ్ర-శృంగవరపుకోట : నోటిఫికేషన్ ఇచ్చిన ప్రతిసారీ వలంటీర్ పోస్టుకు ఇద్దరు, ముగ్గురు దరఖాస్తు చేసుకున్నాం. నాల్గవసారి ఇచ్చిన నోటిఫికేషన్ కు నేను ఒక్కడినే దరఖాస్తు చేసుకుని ఇంటర్వ్యూలో అడిగిన ప్రశ్నలకు జవాబులు స్పష్టంగా చెప్పినా తనతో ఆ పోస్ట్ భర్తీ చేయకుండా మండల అధికారి తిప్పుతున్నారని ఎస్.కోట మండలం, వసి గ్రామానికి చెందిన దళిత యువకుడు లోకేష్ ఆవేదన వ్యక్తంచేశారు. వసి గ్రామంలో తన కుటుంబ సభ్యులతో కలిసి లోకేష్ శనివారం మాట్లాడారు. గడచిన 8 నెలలుగా ఖాళీగా ఉన్న గ్రామ ఎస్సీ కాలనీ వాలంటీర్ పోస్టుకు నాలుగుసార్లు నోటిఫికేషన్ ఇస్తే ధరఖాస్తు చేసి హాజరయ్యానని ఇద్దరు, ముగ్గురు వచ్చిన సందర్భాల్లో ఇంటర్వ్యూకి వెళ్లినప్పటికీ సంబంధిత అధికారులు భర్తీ చేయలేదన్నారు. గతనెల మరోసారి నోటిఫికేషన్ ఇస్తే తమ గ్రామం నుంచి తాను ఒక్కడినే హాజరైతే ఈవోపీఆర్డి ఇంటర్వ్యూ చేసి పంపేశారని ఫలితం చెప్పలేదన్నారు. ఈ పోస్టుకు పదవతరగతి ప్రామాణీకం కాగా తాను ఇంటర్ చదివి డిగ్రీ చదువుతున్న సమయంలో కుటుంబ పరిస్థితులు బాగోక చదువు మానేశానని తెలిపాడు. తనకు ఎటువంటి కులబలం, రాజకీయబలం లేనందున తిరస్కరణ గురయినట్లు భావించి జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్ సెల్లో ఫిర్యాదు చేశానని తెలిపాడు. అయితే ఇక్కడ ఫిర్యాదు చేశాక తమ ఇంటికి ఈవోపీఆర్డీ వచ్చి నిన్ను ఈ వలంటీర్ పోస్టుకి ఎంపిక చేయడానికి తగిన పరిజ్ఞానం లేకపోవడం వలన ఇవ్వలేదని తనతో చెప్పి కాగితాలపై సంత కాలు చేయించుకుని వెళ్ళిపోయా రన్నాడు. వారు ఇంటర్వ్యూలో అడిగిన ప్రతి ప్రశ్నకు సమాధానం చెప్పానని వెల్లడించాడు. ఈ యువకుడి తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు మట్లాడుతూ అన్ని అర్హతులు ఉన్నా తమ కుమారుడుకి ఎందుకు ఈ పోస్టు ఇవ్వడం లేదో తెలియడం లేదని, దీనిలో ఏదైనా రాజకీయం దాగుందో తమకు తెలియదన్నారు. ఇప్పటికైనా ఈ వలంటీర్ పోస్టుని తనకు మంజూరు చేసి మా కుటుంబానికి ఆర్థిక భరోసా ఇవ్వాలని దళిత యువకుడు వసి లోకేష్ వేడుకున్నాడు.

నేడు ఆర్కే సాట్-2024 స్కాలర్ షిప్ ప్రవేశ పరీక్ష

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: ఆర్కే ఎడ్యుకేషనల్ సంస్థలో ఆర్ కే ఐ ఐ టి- జేఈఈ, నీట్ అకాడమీలో ప్రవేశానికి నేడు జిల్లా వ్యాప్తంగా ఆరు పట్టణాల్లో పదవ తరగతి విద్యార్థులకు స్కాలర్ షిప్ పరీక్షల నిర్వహిస్తున్నామని సంస్థ అధినేత కోలా రామకృష్ణారావు తెలియజేశారు. పరీక్షల్లో ప్రతిభ చూపిన వారికి స్కాలర్ షిప్ గా 40 శాతం ఫీజు రాయితీ ఇస్తున్నామన్నారు. విజయనగరం తో సహా బొబ్బిలి రాజాం చీపురుపల్లి ఎస్.కోట గజపతినగరం పట్టణాల్లో ఉదయం 9:30 నుండి మధ్యాహ్నం 12:30 వరకు పరీక్షలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు ఈ అవకాశాన్ని జిల్లా వ్యాప్తంగా ఉండే పదవ తరగతి విద్యార్థులంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు వివరాలకు 9490513355 సంప్రదించాలని తెలిపారు.

ఎంవీజీఆర్ లో ఇంధన పొదుపు పై సదస్సు

విశాలాంధ్ర-డెంకాడ: జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలలో భాగంగా ఎం వి జి ఆర్ ఇంజనీరింగ్ కాలేజ్ లో శనివారం ఇంధన పొదుపు పై సదస్సు జరిగింది..ఈ కార్యక్రమం ను తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఆపరేషన్ సర్కిల్ విజయనగరం మరి యం వి జి ఆర్ ఇంజనీరింగ్ కాలేజీ విజయనగరం వారు సంయుక్తంగా నిర్వహించారు ,, పలు ఇంజనీరింగ్ కాలేజీల నుండి విద్యార్థులు , విద్యుత్ సంస్థలో పని చేసే ఇంజనీర్లు సదస్సులు పాల్గొని ప్రెజెంటేషన్ ఇవ్వడం జరిగింది..విద్యుత్ శాఖ పర్యవేక్షక ఇంజనీరు శ్రీ మువ్వల లక్ష్మణరావు గారు మాట్లాడుతూ విద్యుత్ పొదు పు ఆవశ్యకతను,, సంస్థ తీసుకుంటున్న చర్యలను తెలియజేస్తూ,, వినియోగ దారులకు మంచి అవగాహన కల్పించేందుకు తగిన కృషి చేస్తున్నాం అన్నారు, ఇది మన అందరి బాధ్యత అన్నారు,, ఈ సదస్సులో శ్రీ ఆర్ గౌరీశంకర్ గారు (ఎలక్ట్రికల్ హెడ్ ఆఫ్ ద డిపార్ట్మెంట్) మాట్లాడుతూ నూతన సాంకేతిక విధానాలను అవలంబించి ప్రత్యామ్నాయ ఇంధన వనరులు తో విద్యుత్ ఉత్పాదన చేయాలని , పొదుపు పాటించి గ్లోబల్ వార్మింగ్ తగ్గించాలని,,అందుకు తగ్గట్టు వారి విద్య సంస్థ పలు విధాలుగా ప్రయత్నిస్తుందని తెలిపారు..ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ నుండి పి త్రినాధరావు ఎక్జిక్యూటివ్ ఇంజనీరు(కన్స్ట్రక్షన్,) ,,జి సురేష్ బాబు డీఈ రూరల్,పి హరి డిఈ టౌన్,, కెఎస్పి కుమార్ ఏ డీ ఇ,,భోగాపురం, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

నామినల్ రోల్స్ లో దిద్దుబాట్లు సరిచేయండి

విశాలాంధ్ర-పార్వతీపురం: జిల్లాలోని అన్ని పాటశాలల యాజమాన్యాలకు , ఉన్నతపాఠశాలల ప్రధానోపాధ్యాయులకు మరియు 10వ తరగతి చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియజేయునది ఏమనగా, మార్చి 2024 జరగనున్న పదవతరగతి పరీక్షలు సంబంధించి నామినల్ రూల్స్ లో ఏమైనా దిద్దుబాట్లు ఉన్నట్లయితే నేటి నుంచి ఈనెల 20వరకు స్కూల్ లాగిన్ లో సరి చేయుటకు ఎడిట్ ఆప్షన్ %ఓఏ.ఎంవ.ఖజూ.గ్రశీజ.ఱఅ% వెబ్సైట్ నందు ఇవ్వబడినదని జిల్లా విద్యాశాఖాధికారి ఎన్ ప్రేమ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.కావున అందరూ ఉన్నత ప్రధానోపాధ్యాయులు ఈఅవకాశాన్ని వినియోగించుకొని విద్యార్థుల వివరాలను నామినల్ రోల్ లో ఏవైనా తప్పులు ఉన్నట్లయితే సరి చేసుకోవాలని కోరారు.

సమ్మెకాలంలో అంగన్ వాడీల నిర్వహణ బాధ్యత తీసుకోవాలి

విశాలాంధ్ర-నెల్లిమర్ల: సమ్మెకాలంలో అంగన్వాడీల నిర్వహణ బాధ్యత తీసుకోవాలని నెల్లిమర్ల నగరపంచాయతీ మేనేజర్ టివిఎస్ విశ్వేశ్వరరావు కోరారు. నెల్లిమర్ల నగరపంచాయతీ కార్యాలయంలో వార్డు కార్యదర్శులతో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ కార్యదర్శులు ప్రతిరోజూ అంగన్వాడీ కేంద్రాలను రోజూ తెరుస్తూ పిల్లలు అందరూ కేంద్రాలకు వచ్చేవిధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతిరోజూ పిల్లలకు అందించే పౌష్టికాహారం సమీపంలోని పాఠశాలలో మధ్యాహ్నం భోజనం కేంద్రాల నుంచి సరఫరా చేయాలని కోరారు. గర్భిణులు, బాలింతలకు నెలవారీ ఇవ్వాల్సిన పౌష్టికాహారం అందించాలని సూచించారు. సమావేశంలో ఐసిడిఎస్ సూపరు వైజర్ టి త్రినాథ, మెప్మా సిఓ బి పోలినాయుడు పాల్గొన్నారు.

విద్యారంగాన్ని నాశనం చేస్తున్న కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు



విశాలాంధ్ర-నెల్లిమర్ల: విద్యారంగాన్ని కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు నాశనం చేశాయని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జివిఆర్కే ఈశ్వరరావు అన్నారు. ఎస్ఎఫ్ఐ 31 వ జిల్లా మహాసభల బహిరంగ సభ జిల్లా సహాయ కార్యదర్శి జె రవికుమార్ అధ్యక్షతన నెల్లిమర్ల అమరవీరుల భవనంలో శనివారం నిర్వహించారు. ముందుగా నెల్లిమర్ల సికెఎం ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి అమరవీరుల భవనం వరకూ విద్యార్థులతో భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఈశ్వరరావు మాట్లాడుతూ కేంద్రరాష్ట్ర ప్రభుత్వాల నిరంకుశ విధానాలతో విద్యార్థులు చదువుకి దూరమవుతున్నారన్నారు. అలాగే చదువు చెప్పే ఉపాధ్యాయులపై కర్కషంగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. జాతీయ విద్యావిధానాన్ని రద్దు చేసి విద్యావ్యవస్థని కాపాడాలని కోరారు. ఎస్ఎఫ్ఐ అఖిలభారత కమిటీ సభ్యురాలు సిహెచ్ పావని, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్ వెంకటేష్, పి రామ్మోహన్ పాల్గొన్నారు.

నేడు భగవద్గీత శ్లోక కంఠస్థ పోటీలు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: తిరుమల తిరుపతి దేవస్థానములు- హిందూ ధర్మ ప్రచార పరిషత్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో భగవద్గీత పట్టణ పోటీలు నేడు స్థానిక టీటీడీ కళ్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్లు ప్రోగ్రామింగ్ అధికారి జె శ్యామ్ సుందరం తెలిపారు. అలాగే భగవద్గీత జయంతోత్సవాల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. భగవద్గీత శ్లోక కంఠస్థ పోటీల్లో పాల్గొనేవారు టీటీడీ కళ్యాణ మండపంలో నేడు తమ పేరు నమోదు చేసుకోవాలన్నారు.

బాడంగిలో సెల్ఫీ విత్ టాపర్ కార్యక్రమం

విశాలాంధ్ర-తెర్లాం బాడంగీ :జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాడంగిలో హెచ్ఎం దత్తి సత్యన్నారాయణ ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన ఎస్ఏ వన్ పరీక్షలలో వివిధ సబ్జక్ట్స్ లో టాపర్ గా నిలిచిన విద్యార్థులచే వారి తల్లిదండ్రులు ఉపాధ్యాయులతో కలిసి సెల్ఫీ విత్ టాపర్ కార్యక్రమం విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ప్రవీణ్ ప్రకాష్ వారి ఆదేశానుసారం నిర్వహించడం,తల్లిదండ్రుల సమావేశం కూడా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ 2023-24 విద్యా సంవత్సరం ప్రతీ అసెస్మెంట్ అనంతరం విద్యార్థుల ప్రగతిని చర్చించేందుకు పేరెంట్స్ సమావేశం నిర్వహిస్తున్నామని విద్యార్థులు సక్రమంగా హాజరయ్యేలా వారివిద్యా స్థాయిలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేలా చూడాలని తల్లిదండ్రులను కోరారు ఈసమావేశంలో విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల పర్యవేక్షణ పిల్లలకు ఉజ్వల భవిష్యత్తు

జేసీ గోవిందరావు

విశాలాంధ్ర-పాచిపెంట : తల్లిదండ్రుల పర్యవేక్షణ పిల్లల ఉజ్వల భవిష్యత్ పిల్లల విజయానికి సోపానమని జాయింట్ కలెక్టర్ ఆర్ గోవింద రావు అన్నారు. పాచిపెంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రత్యేక అధికారిగా తల్లిదండ్రులతో పాఠశాల ఆవరణలో నిర్వహించిన సమావేశంలో శనివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లల చదువు పట్ల దృష్టి సారించాలన్నారు. పాఠశాలలో ఉపాధ్యాయులు బోధన చేసి, ఆ అంశాన్ని బాగా అర్థం చేసుకోవాలని తెలియజేసారని దానిని ఇంటి వద్ద సమయం కేటాయించి నేర్చుకునే పర్యవేక్షణ తల్లిదండ్రులు చేయాలన్నారు. మార్చి 18 నుండి పదవ తరగతి పరీక్షలు ప్రారంభం అవుతాయని ఆయన చెప్పారు. పదవ తరగతి ప్రతి విద్యార్థికి కీలకమని, భవిష్యత్తును నిర్ణయించే అంశంగా చెప్పవచ్చని ఆయన అన్నారు. ప్రతీ విద్యార్థి పదవ తరగతిలో ఉత్తీర్ణత సాధించాలని అందుకు తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. కొద్ది సేపు పర్యవేక్షణ బాధ్యతలను తీసుకుంటే మంచి ఫలితాలు వస్తాయని ఆయన పేర్కొన్నారు. ఇంకా సరిగ్గా రెండు నెలల కాలం ఉందని, వారిపై దృష్టి సారించాలని సూచించారు. విద్యార్థులు తెలివైన వారని, ప్రోత్సాహం అందించాలని ఆయన కోరారు.

విశ్వనాధపురంలో ధాన్యపు కొనుగోళ్ల పరిశీలన

జిల్లా జాయింట్ కలెక్టర్ విశ్వనాధపురంలో ధాన్యపు కొనుగోళ్ళను పరిశీలించారు. రైతులతో మాట్లాడుతూ ఎకరానికి వచ్చిన దిగుబడి ఎకరానికి అయ్యే పెట్టుబడి గురించి ఆరా తీశారు. తుఫానులో జరిగే పంట నష్టాల గురించి రైతులను ప్రశ్నించగా గ్రామంలో పెద్దగా పంట నష్టాలు జరగలేదని తెలిపారు. ధాన్యం సంచులను తనిఖీ చేసి రైతులకు ఇవ్వాలని గ్రామ వ్యవసాయ సహాయకులను ఆదేశించారు. రైతులకు అందుబాటులో ఉండి ధాన్యం కొనుగోళ్ళను వేగవంతం చేయాలని వ్యవసాయ అధికారిని ఆదేశించారు. తేమ శాతం 17% లోపు ఉండేటట్టు రైతులకు అవగాహన కల్పించాలని, నాణ్యత ప్రమాణాలను జాగ్రత్తగా పరిశీలించి ధాన్యపు కొనుగోలను జరపాలని కొనుగోలు సిబ్బందిని ఆదేశించారు.

అమ్మవలస అంగన్వాడి కేంద్రం తనిఖీ

అమ్మవలస అంగన్వాడి కేంద్రాన్ని జాయింట్ కలెక్టర్ తనిఖీ చేశారు. అంగన్వాడి నిర్వహణ తీరు, అంగన్వాడి పరిధిలో గర్భిణీలు, బాలింతలు, రక్తహీనత కలిగిన వారు తదితర వివరాలు పరిశీలించారు. పౌష్టికాహారం అందిస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాచిపెంట మండల పరిషత్ డెవలప్మెంట్ ఆఫీసర్ లక్ష్మీకాంత్, తహసిల్దార్ రాజశేఖర్, వ్యవసాయ అధికారి తిరుపతిరావు, రైతులు పాల్గొన్నారు.